



ముసురు.. ముంపు

అల్పపీడనం.. రైతులను ముంచేస్తోంది. పైరు నీటి పాలైంది. ఈదురుగాలులకు నేలవాలింది. కోతలకు సిద్ధమైన వరి చేతికి అందదేమోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఈదురు గాలులతో కూడి ఓ మోస్తరు నుంచి భారీగా వర్షాలు పడుతున్నాయి. మంగళవారం అర్ధ రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకు ముసురు పట్టినట్లు వర్షం పడింది. కొన్ని ప్రాంతాల్లో వర్షం పంటలకు మేలు చేయగా కంకి దశలో ఉన్న వరి, తీత దశలో ఉన్న పత్తి తదితర పంటలకు నష్టం చేసింది. కృష్ణా తీరంలోని లంక గ్రామాల్లో వాణిజ్య పంటలకు వర్షం మేలు చేసింది. వరదలకు పంట దెబ్బ తిన్న చేలల్లో మినుము విత్తిన రైతులకు మాత్రం మళ్లీ నష్టం తప్పదని చెబుతున్నారు. పలు పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాల్లో కాలనీలు జలమయంగా మారడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు.


- అల్పపీడనంతో వీడని వర్షాలు
- పంటలు వర్షార్పణం.. రైతుల ఆందోళన
- కంకి దశలో వరి.. దిగుబడులపై తీవ్ర ప్రభావం

తెనాలి, నరసరావుపేట అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో బుధవారం భారీ వర్షాలు పడ్డాయి. ఎన్నో వ్యయ ప్రయాసలతో సాగు చేసిన వరి చేతికొచ్చే సమయంలో వర్షాలకు నేలవాలిపోవడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాల్లో వివిధ దశల్లో ఉన్న పైరు నేలవాలి వర్షపు నీటిలో నానుతుంది. కృష్ణా పశ్చిమ డెల్టాలో ఖరీఫ్ సాగు 5.73 లక్షల ఎకరాల్లో వరి వేయగా ఈ వర్షాలు రైతులను దెబ్బతీస్తున్నాయి. గుంటూరు జిల్లాలోని మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల, తెనాలి, కొల్లిపర, బాపట్ల జిల్లాలోని కొల్లూరు, వేమూరు, అమృతలూరు, చుండూరు, భట్టిప్రోలు, రేపల్లె తదితర మండలాల్లో ఇప్పటికే వరి కంకులు వచ్చి, గింజ పాలుపోసుకునే దశలో ఉంది. కంకులు రాని పంటకు వర్షం మేలు చేస్తే, కంకి వేసిన పంటకు మాత్రం నష్టం తప్పడంలేదని రైతులు చెబుతున్నారు. గింజ పాలుపోసుకునే దశలో వర్షం ఎక్కువగా ఉంటే, గింజ తాలుగా మారి దిగుబడి తగ్గిపోతుందని ఆందోళన చెందుతున్నారు. గింజ పాలుపోసుకున్న చేలల్లో మాత్రం ముసురు కారణంగా మానుకాయ వల్ల కూడా నష్టం తప్పడంలేదంటున్నారు. బాపట్ల, గుంటూరు జిల్లాల్లో వరి పంట నేలవాలింది. కంకులు బరువు లేకున్నా కొన్ని చేలు చాపలా పరుచుకున్నాయి. దీంతో రైతులకు పంటను పైకి నిలబెట్టుకోవడం తలకుమించిన పని అవుతోంది. అరటి, బొప్పాయి, కంద, పసుపు పంటలు గత వరదలకు దెబ్బతనగా, మిగిలిన వాటికి వర్షం మేలు చేసిందని రైతులు చెబుతున్నారు. వరదల తర్వాత మళ్లీ మినుము చల్లిన రైతులకు ఈ వర్షం నిరాశ మిగిల్చింది. మరోసారి ఆ రైతులకు నష్టం తప్పడంలేదు. మొక్క ఇప్పుడిప్పుడే బయటకు వస్తుంటే, వర్షం ముంచేయడంతో అదికాస్తా దెబ్బతినపోతుందని, మరోసారి విత్తాల్సిందేనని రైతులు ఆవేదన చెందుతున్నారు. గుంటూరు జిల్లాలోని తెనాలి, పొన్నూరు, మంగళగిరి వంటి పట్టణాల్లో రోడ్లు, కాలనీలు జలమయమయ్యాయి. అటు బాపట్ల జిల్లాలోని

(మిగతా 8వ పేజీలో)



కొల్లూరు : మొసలిపాడు వద్ద నేలవాలిన వరిపైరు



హోంమంత్రి అనిత కలెక్టర్లతో సమీక్ష

భారీవర్షాల హెచ్చరికల నేపథ్యంలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని హోంమంత్రి వంగలపూడి అనిత కలెక్టర్లను ఆదేశించారు. కలెక్టర్లతో అమరావతి రాజధాని నుంచి మంత్రి వీక్షణ సమావేశం నిర్వహించారు. బాపట్ల నుంచి కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ హాజరయ్యారు.

నిజాంపట్నం హార్బర్‌లో మూడో నెంబరు హెచ్చరిక

రేపల్లె: బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో సముద్రంలో అలల ఉధృతి ఎక్కువగా ఉంది. బుధవారం నిజాంపట్నం హార్బర్‌లో మూడో నెంబరు ప్రమాద హెచ్చరిక ఎగురవేసినట్లు పోర్టు అధికారులు తెలిపారు. సముద్రంలో వేట చేసే మత్స్యకారులంతా తక్షణమే ఒడ్డుకు చేరాలని వాకీటాకీల ద్వారా సమాచారం అందించారు. సముద్రం అల్లకల్లోలంగా ఉందని మత్స్యకారులు బోట్లు వేసుకుని తిరుగు ప్రయాణమై హార్బర్‌కు చేరారు.

ఎన్టీఆర్ వైద్య సేవలు బంద్!



గత 14 రోజులుగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ వైద్య సేవలు నిలిచిపోయాయి. పేద రోగులు అత్యవసర పరిస్థితుల్లో సొమ్ము చెల్లించి వైద్యం చేయించుకోవాల్సిన దయనీయ స్థితిని ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం, ప్రైవేట్ వైద్యశాలల మధ్య బిల్లుల బకాయి రగడ నడుస్తోంది. బకాయి చెల్లింపుల అంశంలో పలుమార్లు ప్రభుత్వంతో జరిగిన చర్చలు విఫలం కావడంతో ఆస్పత్రుల నిర్వాహకులు ఉచిత వైద్య సేవలను నిలిపివేశారు. బకాయి విడుదల కోరుతూ ఆందోళన బాట పట్టారు. గురువారం చలో విజయవాడకు నెట్‌వర్క్ ఆస్పత్రుల యూనియన్ పిలుపు నిచ్చింది. పల్నాడు జిల్లాలో 111, గుంటూరు జిల్లాలో 128, బాపట్ల జిల్లాలో 60 నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉచిత వైద్య సేవలను నిలిపివేసినట్లు యూనియన్ నేతలు తెలిపారు.

ఉచిత వైద్యసేవలను నిలిపివేసిన నెట్‌వర్క్ ఆస్పత్రులు

- వైద్యం అందక పేద రోగుల ఇక్కట్లు
- బిల్లుల విడుదల కోసం వైద్యుల ఆందోళన బాట
- నేడు చలో విజయవాడ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వం హయాంలో ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం పెండింగ్ బిల్లులను కొంత మేర చెల్లించింది. అయితే పాత బకాయిలతో పాటు కొత్త బకాయిలు పేరుకుపోయాయి. దీంతో నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ వైద్య సేవలను నిలిపివేసి బకాయి (మిగతా 8వ పేజీలో)



నరసరావుపేటలో ప్రదర్శన నిర్వహిస్తున్న నెట్ వర్క్ ఆస్పత్రుల వైద్యులు, వైద్య సిబ్బంది

పిడుగుపాటుకు కూలిన జీవితాలు

- ఇద్దరు మహిళా కూలీల మృతి..
- మరో మహిళకు తీవ్ర గాయాలు



కమలమ్మ



ముజాహిదా

పొన్నూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు వరి పొలంలో కలుపు తీస్తున్న ఇద్దరు మహిళా కూలీలు మృతి చెందారు. దీంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. పొన్నూరు పట్టణానికి చెందిన మహిళా కూలీలు బుధవారం పట్టణ శివారులో ఉన్న బాడవ డొంకలోని వరి పొలాల్లో కలుపు తీయడానికి వెళ్లారు. ఎడతెరిపి లేని వర్షం కురుస్తుండటంతో కూలీలు పంట పొలం నుంచి బయలుదేరారు. ఈ క్రమంలో ఒక్కసారిగా కాలువ దాటుతున్న వలపర్ల కమలమ్మ (45) అలియాస్ మరియమ్మ, షేక్ ముజాహిదా (50) పిడుగుపాటుకు గురయ్యారు. పక్కనే ఉన్న పంట కాల్వలో విగత జీవులై పడ్డారు. వారి సమీపంలో ఉన్న మరో మహిళ మేళం మాణిక్యమ్మ గాయాలు కావడంతో.. స్పృహ తప్పి పడిపోయింది. ఆమెను 108 వాహనంలో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. తోటి కూలీలు, మృతుల కుటుంబ సభ్యులు ఘటనా స్థలంలో విగత జీవులుగా ఉన్న వారిని చూసి కంటతడి పెట్టుకున్నారు. అర్బన్ సీఐ ఎల్.వీరా నాయక్, తహసీల్దారు జియావుల్ హక్ ఘటనా స్థలానికి చేరుకొని.. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నిడుబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఉపాధిలో.. సమతౌల్యం ఉండాలి

ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకోవాలి • సమీక్షలో కలెక్టర్ కృతికా శుక్లా

నరసరావుపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులు, నిధుల వినియోగంలో నియోజకవర్గాల మధ్య సమతౌల్యం ఉండేలా చూడాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. డ్వామా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల ప్రగతి నివేదికపై కలెక్టరేట్‌లో బుధ వారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకుని ఉపాధి నిధులను పూర్తిగా వినియోగించాలన్నారు. జిల్లాలోని 103 చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల నిర్మాణాలను వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా కేంద్రాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలన్నారు. వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలన్నారు. వెటర్నరీ ఆస్పత్రుల్లో మరుగుదొడ్లు నిర్మించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో జ్యోతి బసు, డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి, భూగర్భ జల శాఖ ఏడీ రామబాలాజీరెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి వెంకట్రావు, డీపీవో నాగేశ్వర్‌నాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా


రిజిస్ట్రేషన్లు డమాల్

ప్రభుత్వానికి తగ్గిన ఆదాయం • గత ఏడాదితో పోలిస్తే 40 శాతం తక్కువ

పిడుగురాళ్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గాయి. దీంతో స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖకు ఆదాయం గణనీయంగా తగ్గింది. పిడుగురాళ్ల, గురజాల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో గత ఏడాది మొదటి ఆరు నెలల వరకు చూస్తే 8 వేలకు పైగా రిజిస్ట్రేషన్లు జరిగాయి. పిడుగురాళ్లలో 4 వేల రిజిస్ట్రేషన్లు జరగ్గా, గురజాలలో ఒక వంద అటు ఇటుగా దాదాపుగా అదే సంఖ్యలో రిజిస్ట్రేషన్లు జరిగాయి. దీంతో ఆ మేర ప్రభుత్వానికి ఆదాయం బాగానే అందింది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఏప్రిల్ నుంచి 40 శాతానికి పైగా రిజిస్ట్రేషన్లు తగ్గాయి. పిడుగురాళ్ల, గురజాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సుమారు 6 వేలకు పైగా రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గాయని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

అనధికార లేఅవుట్లతోనే..

కొండమోడు నుంచి గురజాల వరకు అద్దంకి-నార్కెట్‌పల్లి హైవేకు సమీపంలోని కొన్నింటిని అధికారులు అనధికార లేఅవుట్లుగా ప్రకటించారు. దీంతో ఆయా లేఅవుట్లలో ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రస్తుతానికి ఆగిపోయింది. పిడుగురాళ్లలో లేఅవుట్లు, మరికొన్ని అపార్ట్‌మెంట్ల విక్రయాలకు సంబంధించి రిజిస్ట్రేషన్లు నరసరావుపేట, గుంటూరులో జరగడంతో పిడుగురాళ్లలో రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గాయి. దీంతో ఇక్కడకు రావాల్సిన ఆదాయం నరసరావుపేట, గుంటూరుకు వెళ్లింది.



పిడుగురాళ్ల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం



హాజరైన ఎంపీటీసీలు

ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాసం

పదవి కోల్పోయిన మేకల శారద

- టీడీపీ తీర్మానం.. వైసీపీ ఎంపీటీసీల మద్దతు

కారంపూడి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కారంపూడి ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డిపై టీడీపీ ఎంపీటీసీలు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. రెండేళ్లుగా సర్వసభ్య సమావేశాలకు ఎంపీపీ మేకల శారదా శ్రీనివాసరెడ్డి గైర్హాజరవడంతో ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెడుతున్నట్లు ఆర్డీవో మురళీకృష్ణకు తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి 15 మంది ఎంపీటీసీలకు 11 మంది హాజరయ్యారు. ఒప్పిచర్ల - 2 ఎంపీటీసీ ఇరుకదిండ్ల శ్రీను అవిశ్వాసాన్ని ప్రతిపాదించగా గాదెవారిపల్లె ఎంపీటీసీ కూనిరెడ్డి సైదారెడ్డి, వేపకంపల్లి ఎంపీటీసీ బొల్నేడి కనకదుర్గ శ్రీనివాసరావు బలపరిచారు. మిగిలిన 8 మంది అవిశ్వాసానికి మద్దతుగా ఓటేశారు. పూర్తి మద్దతుతో అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లు ఆర్డీవో ప్రకటించారు. కాగా వైసీపీ ఎంపీటీసీలు కూడా అవిశ్వాసానికి మద్దతుగా ఓటేయడం గమనార్హం. దీంతో ఎంపీటీసీలు జై చంద్రబాబు.. జై పవన్‌కల్యాణ్.. జైజై బ్రహ్మానందరెడ్డి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, మండల అధ్యక్షుడు గోళ్ల సురేష్‌యాదవ్, బొల్నేడి శ్రీనివాసరావు, ఉన్నం లక్ష్మీనారాయణ, మునుగోటి సత్యం, చప్పిడి రాము, బొమ్మిన శేషగిరి, సొసైటీ అధ్యక్షుడు నాగారపు రామకృష్ణ, చెన్నకేశవస్వామి ఆలయ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, కటికల బాలకృష్ణ, తండా మస్తాన్ జాని, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన క్రమబద్ధీకరణ

సత్తెనపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎక్కడికక్కడ అనధికార లే అవుట్లు వెలుస్తున్నాయి. అనుమతులు లేకుండా వెలిసిన లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు అటు ఇంటి నిర్మాణాలకు, ఇటు బ్యాంకుల నుంచి రుణాలు రాక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం అనుమతి లేని లేఅవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం ఇచ్చింది. అయితే పలు ప్రాంతాల్లో రియల్టర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం లేదని మున్సిపల్ అధికారులు తెలిపారు. లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ 2020 ప్రకారం జరిమానా చెల్లించాల్సి వస్తుందేమోనన్న భయంతో వెనుకడుగు వేస్తుంటే అవగాహన కల్పించాల్సిన అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. సత్తెనపల్లిలో వైసీపీ ప్రభుత్వ హయాంలో అనుమతి లేని లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలిశాయి. మామూళ్ల మత్తులో అనధికార లేఅవుట్‌దారులను అధికారులు ప్రోత్సహించారన్న ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అనుమతి లేకుండా వేసిన లే అవుట్ల జాబితా సేకరించింది. ఈ క్రమంలో ఆయా లే అవుట్లలో 2020 జూన్ 30 లోపు ప్లాట్లు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారంతా ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. మొదట దరఖాస్తు గడువును సెప్టెంబరు నెలాఖరు వరకు ఇవ్వగా తర్వాత దానిని అక్టోబరు 23 వరకు పొడిగించారు. ఈ అవకాశం కోల్పోతే అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు విక్రయించడం సాధ్యం కాదు. అటు ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా, ఇటు ప్రజలకు ఇబ్బంది లేకుండా క్రమబద్ధీకరణకు ప్రభుత్వం వీలు కల్పించింది. అయితే గడువు సమీపిస్తున్నా రియాల్టర్లు ముందుకు రావడంలేదు.

67 అక్రమ లేఅవుట్లు

సత్తెనపల్లి పురపాలక సంఘంలో 67 అక్రమ లే అవుట్లను అధికారులు అధికారికంగా గుర్తించారు. వాటిలో ఐదు వందల వరకు ప్లాట్లు ఉన్నాయి. ఐదు వందల మందికి అధికారులు నోటీసులు జారీ చేశారు. వీరిలో 67 మంది మాత్రమే క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నారు. మిగిలిన వారు ఎటువంటి దరఖాస్తు చేసుకోలేదు.

కఠిన చర్యలు తీసుకుంటాం

పురపాలక సంఘంలో అనధికార ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్ తెలిపారు. ప్లాట్లను క్రమబద్ధీకరించుకోకపోతే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిర్మాణాలకు అనుమతి ఇవ్వమన్నారు. మున్సిపల్ సౌకర్యాలు కల్పించమని తెలిపారు.



అక్రమ లేఅవుట్లను పరిశీలిస్తున్న అధికారులు (పాత చిత్రం)



నాడు వైభోగం.. నేడు విషాదం
- బాధల్లో 'బంగారు' బతుకులు!
- రెడీమేడ్, మాల్స్ రాకతో పనులపై ప్రభావం
- రోడ్డుపాలవుతున్న స్వర్ణకారుల కుటుంబాలు

8లో..

'పెమ్మసాని' చొరవతో ఏపీకి రూ. 665 కోట్లు 6లో..

పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ ఆదర్శం
- ఎంపీ లావు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి

హైస్పీడ్.. సిద్ధం



- ఎలివేటెడ్ రైల్ కారిడార్‌కు డీపీఆర్
- గుంటూరు మీదగా హైదరాబాద్ - చెన్నైకు ప్రాజెక్టు
- పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల మీదగా ఎలైన్‌మెంట్

1 • తెలంగాణలోని ఖమ్మం మీదగా అమరావతి రాజధాని, నంబూరు, గుంటూరు, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, తిరుపతి విమానాశ్రయం, చెన్నై ఓఆర్ రోడ్డు మీదగా చెన్నై సెంట్రల్.

2 • హైదరాబాద్, శంషాబాద్, భారత్ సిటీ, దాచేపల్లి(నడికుడి), నంబూరు, గుంటూరు, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, తిరుపతి ఎయిర్‌పోర్టు, చెన్నై ఓఆర్ రోడ్డు, చెన్నై సెంట్రల్.

నరసరావుపేట అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ - చెన్నై హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్ ప్రాజెక్టు నివేదిక సిద్ధమైంది. దక్షిణ మధ్య రైల్వే(కన్‌స్ట్రక్షన్స్) విభాగం డీపీఆర్‌ని సిద్ధం చేసి రైల్వేబోర్డుకు నివేదించనున్నది. ఈ కారిడార్ మొత్తం పొడవు 760 కిలోమీటర్లు కాగా అందులో 504 కిలోమీటర్లు ఏపీలో ఉండగా పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల మీదగా ఎలైన్‌మెంట్ ఉన్నది. ఇప్పుడున్న ఎస్ఎస్ఆర్ రేట్స్ ప్రకారం ప్రాజెక్టు ఖర్చు రూ.3.04 లక్షల కోట్లు అవుతుందని అంచనా. డిజైన్ స్పీడ్ గంటకు 350 కిలో మీటర్లు కాగా ఆపరేషనల్ స్పీడ్ 320 కిలోమీటర్లుగా పొందుపరిచారు. మొత్తం తొమ్మిది రైల్వేస్టేషన్లు రాష్ట్రంలో ఉంటాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం దాదాపుగా 90.315 హెక్టార్ల అటవీ భూమి అవసరం అవుతుంది. దేశంలో ప్రప్రథమంగా హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్ ప్రాజెక్టు కొన్నేళ్ల క్రితం ముంబై - అహ్మదాబాద్ మధ్య నిర్మాణం ప్రారంభించారు. ఇది ఇంకా పూర్తి కాలేదు. కాగా ఎన్‌డీఏ ప్రభుత్వం మరో హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్‌ని హైదరా బాద్ - చెన్నై (మిగతా 8వ పేజీలో)

'పెమ్మసాని' చొరవతో ఏపీకి రూ.665 కోట్లు

● విడుదల చేసిన కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ

గుంటూరు సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో ఉపాధి హామీ పనుల కింద ఏపీకి రూ.665 కోట్ల విలువైన మెటీరియల్ కాంపోనెంట్‌ను కేంద్రప్రభుత్వం బుధవారం మంజూరు చేసింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మెటీరియల్ కాంపోనెంట్‌కు సంబంధించి కేంద్రం ఈ నిధులను విడుదల చేసింది. ఈ నిధులు రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనుల మెటీరియల్ ఖర్చులకు ఉపయోగపడనున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులలో భాగంగా అవసరమైన మెటీరియల్ నిమిత్తం ఈ కాంపోనెంటును గ్రామీణాభి వృద్ధిశాఖ కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ విడుదల చేశారు. ఏడాదిన్నర కాలంగా ఏపీలో ఉపాధి హామీ పథకం కింద పనులు చేయించిన వ్యక్తులకు ఈ మెటీరియల్ కాంపోనెంట్ విడుదల దోహదపడనుంది. ఇందుకు సహకరించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు పెమ్మసాని ధన్యవాదాలు తెలియజేశారు.

అన్నపర్రు ఘటనపై విచారణ

హాస్టల్లో వంట మనిషి, విద్యార్థులను విచారించిన న్యాయాధికారి



విద్యార్థులను విచారిస్తున్న బాపట్ల 6వ కోర్టు అడిషనల్ జడ్జి శ్యాంబాబు

పెదనందిపాడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అన్నపర్రు బీసీ బాలుర వసతి గృహంలో కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై బుధవారం విచారణ జరిగింది. జిల్లా కోర్టు జడ్జి ఆదేశాల మేరకు బాపట్ల 6వ కోర్టు అడిషనల్ జడ్జి శ్యాంబాబు వసతి గృహంలోని విద్యార్థులు, వార్డెన్, వంట మనిషిని విచారించారు. ముందురోజు ఇచ్చిన ఆహారం, తయారీ విధానం, మెనూ, సిబ్బంది పనితీరు ఇలా పలు అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. వసతి గృహంలో విద్యార్థులకు ఇంకా సమకూర్చాల్సిన వసతులపై ఆరా తీశారు. సమగ్ర నివేదిక తయారుచేసి జిల్లా ఉన్నతాధికారులతో పాటు రాష్ట్ర లీగల్ సెల్ అథారిటీకి అందజేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ప్రిన్సిపల్ సీనియర్ అసిస్టెంట్ జడ్జి జి.వాణి, ఎంపీడీవో స్వామిరెడ్డి, పీఎల్‌వీ ఐ.మాణిక్యరావు ఉన్నారు.

పత్తి కొనుగోళ్లను పారదర్శకంగా నిర్వహించాలి

● మార్కెటింగ్‌శాఖ రాష్ట్ర కమిషనర్ విజయ సునీత




ప్రసంగిస్తున్న మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమిషనర్ విజయ సునీత

గుంటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోళ్లను వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో పారదర్శకంగా నిర్వహించాలని మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమిషనర్, డైరెక్టర్ విజయ సునీత ఆదేశించారు. బుధవారం గుంటూరు ఏఎంసీ(మిర్చియార్డు) మీటింగ్ హాల్‌లో పత్తి కొనుగోళ్లపై అనంతపురం, కర్నూలు, గుంటూరు, బాపట్ల, పల్నాడు, కృష్ణ, ప్రకాశం జిల్లాల మార్కెటింగ్ అధికారులకు పునశ్చరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ విజయ సునీత మాట్లాడుతూ గత ఏడాదితో పోల్చితే పత్తి కొనుగోళ్లలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొన్ని మార్పులు చేసిందన్నారు. వాటిపై ప్రతి ఒక్కరూ స్పష్టమైన అవగాహన కలిగిఉండాలని సూచించారు. ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. పత్తి పండించిన రైతులు తొలుత సమీపంలోని రైతు సేవా కేంద్రాలకు వచ్చేలా సమాచారం అందించాలన్నారు. అక్కడ గ్రామ వ్యవసాయ సహాయకులు(వీఏఏ) అందుబాటులో ఉండి సీఎం యాప్‌లో రైతు ఆధార్, మొబైల్ నంబరుని నమోదు చేసి వివరాలను నమోదు చేయాలన్నారు. అవి ఆటోమేటిక్‌గా కపాస్ కిసాన్ యాప్‌లోకి వస్తాయన్నారు. కపాస్ కిసాన్ యాప్ అనేది అందరూ వినియోగించుకోవచ్చన్నారు. స్లాట్ బుకింగ్ జరిగిన తర్వాత తిరిగి సీఎం యాప్‌లో గత ఏడాది వలే ప్రత్తి కొనుగోళ్ల ప్రక్రియని సూపర్‌వైజర్ లాగిన్ ద్వారా చేయాల్సి ఉంటుందన్నారు. చివరగా సంబంధిత ఏఎంసీ సెక్రెటరీ క్రాస్ చెక్ చేసి ఆమోదం తెలపాలి. అప్పుడే తక్‌పట్టి జనరేట్ అవుతుందన్నారు. ఆ తర్వాతనే సీసీఐ అధికారి పరిశీలన చేసి సంబంధిత రైతు బ్యాంకు ఖాతాకు నగదు జమ చేసేలా చూస్తారన్నారు.

ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 4,56,107 హెక్టార్లలో పత్తి పంటని సాగు చేశారని, దాదాపుగా 8 లక్షల టన్నుల పత్తి దిగుబడికి అవకాశం ఉందన్నారు. బేల్స్‌లోకి లెక్కిస్తే 15, 23,809 వస్తాయన్నారు. ఈ-క్రాప్ బుకింగ్ ప్రకారం ఇప్పటి వరకు 4,26,477.25 హెక్టార్ల పంట నమోదైందన్నారు. తేమ శాతం విషయంలో ఒక శాతం మాత్రమే సడలింపు ఉంటుందన్నారు. స్లాట్ బుకింగ్ చేసిన రోజునే ప్రత్తిని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాల్సి ఉంటుందని, లేకుంటే అది రద్దు అవుతుందన్నారు. రైతులు కచ్చితంగా కొనుగోలు కేంద్రానికి రావాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీసీఐ జనరల్ మేనేజర్ రాజేంద్ర షా, మార్కెటింగ్ జేడీలు కాకుమాను శ్రీనివాసరావు, రాజశేఖర్, సుధాకర్, డీడీ దివాకర్, జీఏఎంసీ సెక్రెటరీ ఏ చంద్రిక, ఏడీ సత్యన్నారాయణ చౌదరీ తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం బ్యారేజి దిగువకు 49,335 క్యూసెక్కులు



ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరదనీరు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టుతో పాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 54,865 క్యూసెక్కుల వరద నీరు బుధవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 11.6 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 49,335 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాలువకు 2,523 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 3,007 క్యూసెక్కులు వదులుతుండగా, గుంటూరు చానల్‌కు నీటి విడుదల నిలిపివేశారు.

నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సాగర్ జలాశయం నీటిమట్టం బుధవారం నాటికి 587.50 అడుగులు ఉంది. ఇది 305.80 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,800, ఎడమ కాలువ ద్వారా 7,937, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 32,723, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 52,560 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 52,560 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

నిరాటంకంగా విద్యుదుత్పత్తి..

రెంటచింతల,అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన రెండు యూనిట్ల ద్వారా మంగళవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.0722 ఎంయూల విద్యుదుత్పత్తి చేసినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు చెప్పారు. ప్రాజెక్టుకున్న 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 3 గేట్లను ఒక మీటర్ మేర ఎత్తి 12702 క్యూసెక్కులు,టేల్ రేస్ చానల్ ద్వారా 8,672 క్యూసెక్కులు మొత్తంగా 21,374 క్యూసెక్కుల నీరు పులిచింతలకు విడుదల చేస్తున్నారు. ఎగువన సాగర్, ఎత్తిపోతల జలపాతం, హాలియా వాగుల నుంచి 32,723 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7.080 టీఎంసీలకు సమానం.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

● మంత్రి అనగాని

రేపల్లె, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశమున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ సూచించారు. రెవెన్యూ అధికారులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చెయ్యాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. మత్స్యకారులెవరూ చేపల వేటకు వెళ్లొద్దని, ప్రజలు అనవసర ప్రయాణాలు మానుకోవాలన్నారు. ఈదురు గాలులతో కూడిన వర్షాల కారణంగా చెట్లువిరిగిపడే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజారవాణా కు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నెల్లూరు, బాపట్ల, చిత్తూరు జిల్లాల్లో ఇప్పటికే వర్షాలు పడుతున్న నేపథ్యంలో అధికారులంతా సహాయ చర్యల్లో పాల్గొనాలని మంత్రి ఆదేశాలు జారీచేశారు.

కల్తీ మద్యం కట్టడికి సురక్షా యాప్ : చీఫ్‌విప్ జీవీ

వినుకొండటౌన్, అక్టోబరు 22: కల్తీ మద్యం పేరు వినిపిస్తేనే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. స్థానిక టీడీపీ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కల్తీ మద్యం అన్న మాటే వినిపించకూడదన్న లక్ష్యంతో ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుందన్నారు. ఇందుకు నూతనంగా సురక్షా మొబైల్ యాప్‌ను తీసుకొచ్చిందని చెప్పారు. దాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత స్థానిక ఎక్సైజ్ అధికారులు, మద్యం దుకాణదారులపై ఉందన్నారు. అక్రమ మద్యం నివారణకు ఈ నెల 29 వరకు వారం రోజుల పాటు ప్రజా భద్రతా అవగాహన ప్రచారాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు. నాయకులు స్థానిక మద్యం దుకాణాలను సందర్శించాలన్నారు.

ఫార్మసీ పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఏప్రిల్‌లో జరిగిన ఫార్మసీ రివాల్యూషన్ పరీక్ష ఫలితాలను బుధవారం పరీక్షల నియంత్రణ అధికారి శివప్రసాద్ విడుదల చేశారు. జూలైలో జరిగిన నానోటెక్నాలజీ సెమిస్టర్ ఫలితాలను కూడా విడుదల చేశారు. వచ్చే నెల 3లోగా రూ.1860 చెల్లించి రివాల్యూషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

కుక్కల దాడిలో ఎద్దు మృతి

నాదెండ్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూబాడు గ్రామంలో మూకుమ్మడిగా కుక్కలు దాడి చేయడంతో ఎద్దు మృతి చెందింది. దీని విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని యజమాని, రైతు అబ్దుల్ రహీం తెలిపారు. గ్రామంలో సుమారు మూడు వందలకు పైగా కుక్కలు తిరుగుతున్నాయి. విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలన్నా.. భయ పడుతున్నారు. గతంలోనూ ఈ సమస్యపై పంచాయతీ అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఇంత వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

రూ.42 లక్షల పురుగు మందుల సీజ్



అధికారులు సీజ్ చేసిన పురుగుమందుల బాక్సులు

గురజాలటౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గురజాల పట్టణంలో మందులను వ్యవసాయాధికారులు సీజ్ చేశారు. హైదరాబాద్ నుంచి గురజాలకు బత్తుల శ్రీనివాసరావు పేరుపై బుధవారం పట్టణంలోని నవత ట్రాన్స్‌పోర్టుకు 120 బాక్సుల పురుగు మందుల కేసులు వచ్చాయి. ఏవో పుల్లారెడ్డి ట్రాన్స్‌పోర్టు కార్యాలయానికి చేరుకొని వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌పోర్టుకు సంబంధించి నమోదు చేసిన ఫోన్ నంబర్లను సంప్రదిం చినట్లు తెలిపారు. అందులో నంబరు పనిచేయడం లేదని, మరో నంబరు కాల్ ఎత్తిన వ్యక్తి తనకు ఎటువంటి సంబంధం లేదని వివరణ ఇచ్చారని తెలిపారు. సదరు బాక్సుల్లో బేయర్ కంపెనీకి చెందిన పురుగు మందులు ఉన్నాయన్నారు. పురుగు మందుల శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులకు సమాచారం అందించామని, పురుగు మందుల విలువ సుమారు రూ. 42 లక్షల వరకు ఉంటుందని చెప్పారు.

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడికి ఆహ్వానం



వెంకయ్యనాయుడును కలిసిన డాక్టర్ గజల్ శ్రీనివాస్ దంపతులు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర సారస్వత పరిషత్, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో వచ్చే ఏడాది జనవరి 3 నుంచి 5 వరకు గుంటూరులో జరిగే 3వ ప్రపంచ తెలుగు మహాసభలకు మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడును పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్, సురేఖ దంపతులు ఆహ్వానం పలికారు. మహాసభల్లో భాగంగా 5న సమాపనోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరవ్వాలని వెంకయ్యనాయుడుని వారు కోరారు. ఈ సందర్భంగా ఆయన సానుకూలంగా స్పందించారని డాక్టర్ గజల్ శ్రీనివాస్ పేర్కొన్నారు.

ప్రజలకు మేలు చేస్తే జగన్‌కు నచ్చదు

● ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అనేక కార్యక్రమాలు దేశంలోనే ఆంధ్రప్రదేశ్ నంబరు వన్‌గా నిలిపే విధంగా ఉన్నాయని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పారిశ్రామిక వేత్తలు కూటమిపై ఉన్న నమ్మకంతో ఏపీ వైపు వస్తున్నారన్నారు. దీనిని అడ్డుకునేందుకు వైసీపీ కావాల్సినంత విష ప్రచారం చిమ్ముతోందన్నారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు మరికొన్ని రాష్ట్రాలు ప్రయత్నించినా ఏపీ వైపే మొగ్గు చూపడం.. కూటమి ప్రభుత్వం కృషి వల్లే సాధ్యమైందని.. ఐటీ రంగం నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారన్నారు. నియోజకవర్గానికి చెందిన మెగా డీఎస్సీ ఉపాధ్యాయులతో వచ్చే నెలలో గెట్ టు గెదర్ ఏర్పాటు చేస్తామన్నారు. వరంగల్ జిల్లాలోని ఓ గ్రామంలో రైతులు సాగు చేస్తున్న అధునాతన పద్ధతులు, పంటల సాగు విధానంపై వచ్చే నెలలో వ్యవసాయ అధికారులు, రైతులతో ముఖాముఖి, పంటల సందర్శన చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో కొమ్మినేని రామచంద్రరావు, వడ్డవల్లి సర్వేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ వీరాస్వామి, కనిగిరి శ్రీను, దియ్యా రామకృష్ణ, వడ్డవల్లి సాంబశివరావు, గండికోట వెంకటేశ్వర్లు, బాబావలి, తంగెళ్ల శ్రీను, కోట హరి, యడ్లపల్లి శివ, నారాయణ, నల్లపాటి నెహ్రూ, పర్వతనేని రామారావు, వున్నం వెంకట్రావు, చింతలపూడి రామ్మూర్తి, కారు సైదా, మేకల రాంబాబు, అనబోతుల నర్సిరెడ్డి, వల్లెపు రామకృష్ణ, తెలుగుయువత ఖాశిం, నర్రా సాంబశివరావు, మేకల మస్తాన్, మీనిగల అంజిబాబు, లంజేపల్లి కొండలు పాల్గొన్నారు.

నకిలీ డీఎస్పీ అరెస్టు

చిలకలూరిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నకిలీ డీఎస్పీ అవతారం ఎత్తి పోలీసు ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన ఒక యువకుడిని చిలకలూరిపేట పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణలోని సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లి గ్రామానికి చెందిన బత్తుల శ్రీనివాస్ (35) అనే యువకుడు స్థానిక సుగాలీ కాలనీలో నివాసముంటున్నాడు. పోలీస్ శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి. స్థానిక గుండయ్య తోటకు చెందిన ధూపాటి భులక్ష్మి అనే యువతి వద్ద రూ.30 వేలు తీసుకున్నాడు. గుంటూరు కలెక్టర్ కార్యాలయం వద్దకు ఆమెను తీసుకువెళ్లి పోలీసు యూనిఫాం, బ్యాడ్జి, లాఠీ, టోపీ ఇచ్చాడు. ఉద్యోగం వచ్చిందని భావించి ఇంటికి వచ్చిన బాధితురాలికి అసలు విషయం బోధపడింది. మోసపోయినట్టు గ్రహించి పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు దర్యాప్తు జరుపగా ఆ యువకుడు పలు నేరాలకు పాల్పడినట్టు తెలుసుకున్నారు. మార్కాపురం, రాజమండ్రి, మేడికొండూరు, త్రిపురాంతకం, నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్లలో అతడిపై కేసులో ఉన్నట్లుగా గుర్తించారు. చిలకలూరిపేట కేసులో ముద్దాయిగా ఉన్న అతనిని బుధవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. అనంతరం రిమాండ్‌కు పంపారు. చిలకలూరిపేట అర్బన్ సీఐ పి.రమేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య కళాశాలకు.. పూర్వ విద్యార్థుల రూ.కోటి విరాళం

గుంటూరు మెడికల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశాల 1980వ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు కాలేజీలోని వివిధ విభాగాల అభివృద్ధికి కోటి రూపాయల విరాళం ప్రకటించారు. ఈ మేరకు వారు ఈ విషయాన్ని జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారీకి తెలిపారు. ఈ బ్యాచ్‌కు చెందిన అమెరికాలో స్థిరపడిన ఎన్నారై డాక్టర్ లీలా తన తల్లిదండ్రుల పేరిట రూ.51 లక్షల విరాళం ప్రకటించారు. డాక్టర్ లీలా అందజేసే విరాళంలో రూ.25 లక్షల వ్యయంతో ఫిజీయాలజీ ల్యాబ్‌ను, రూ.26 లక్షలతో మైక్రోబయాలజీ ల్యాబ్‌ను ఆధుకరించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి తెలిపారు. మిగిలిన పూర్వ విద్యార్థులు అందజేసే రూ.50 లక్షలతో బయోకెమిస్ట్రీ ల్యాబ్‌ను ఆధుకరిస్తామని ఆయన ప్రకటించారు. తమ మాతృ విద్యాసంస్థ అభివృద్ధికి చేయూతనిచ్చేందుకు ముందుకు వచ్చిన 1980వ బ్యాచ్ పూర్వ విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ మాధవి అభినందించారు.

నిందితుడికి జీవిత ఖైదు.. జరిమానా

నరసరావుపేట లీగల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భార్యను అదనపు కట్నం కోసం వేధించిన నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.20 వేల జరిమానా పడింది. ప్రకాశం జిల్లా పొదిలికి చెందిన చల్లా అనిల్‌కుమార్‌కు నరసరావుపేట మండలం ఎక్కలవారిపాలెం గ్రామానికి చెందిన మచ్చ గాని వేమలమ్మకు 2015లో వివాహమైంది. చెడు వ్యసనాలకు బానిసైన నిందితుడు అనిల్‌కుమార్ తన భార్యను అదనపు కట్నం కోసం వేధించేవాడు. ఈ నేపథ్యంలో వేమలమ్మ అతని వేధింపులు భరించలేక 2019లో గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు మృతురాలు తండ్రి శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణలో నేరం రుజువడంతో నిందితుడికి జీవితఖైదుతోపాటు రూ.20వేల జరిమానా విధిస్తూ నరసరావుపేట 13వ అదనపు జిల్లా అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికారి డాక్టర్ నేతి సత్య శ్రీ బుధవారం తీర్పు ఇచ్చారు. ఈ కేసు ప్రాసిక్యూషన్ ఏపీపీ గుండాల సురేష్ బాబు నిర్వహించారు.

ఆరేపల్లిలో అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

● మృతుడి భార్య తరుపు వారే కారణమంటున్న బంధువులు



వివరాలు తెలియజేస్తున్న మృతుని బంధువులు

రొంపిచర్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రొంపిచర్ల మండలం ఆరేపల్లిలో బ్రహ్మయ్య (42) అనే వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. అతను పురుగుల మందు తాగి పడి ఉండడాన్ని చూసి కుటుంబసభ్యులు హుటాహుటిన నరసరావుపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. చనిపోయే ముందు బ్రహ్మయ్య సెల్ఫీ వీడియో తీసుకొని బంధువులకు పంపాడు. బ్రహ్మయ్య చావుకు అతని భార్య సుజాత ఆమె బంధువులే కారణమని అతని తల్లి, కుమార్తె ఆరోపిస్తున్నారు. సుజాత ముప్పాళ్లలో ఒక వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందని, దాన్ని కొనసాగించవద్దని కొన్ని సంవత్సరాలుగా బ్రహ్మయ్య వారిస్తూ వస్తున్నాడని చెప్పారు. అయినా ఆమె తీరు మార్చుకోలేదని, ఈ నేపథ్యంలోనే అతడు అనుమానస్పద రీతిలో మరణించాడని పేర్కొన్నారు. కాగా, బ్రహ్మయ్య తల్లి, కుమార్తె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పిడుగు పాటుకు పాడి గేదె మృతి

క్రోసూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉయ్యందనలో బుధవారం మధ్యాహ్నం పిడుగుపాటుకు గురై లేళ్ల సత్యనారాయణకు చెందిన పాడి గేదె చనిపోయింది. దీని విలువ రూ.85వేలు వరకు ఉంటుందని యజమాని తెలిపారు. పిడుగు పాటుకు గ్రామంలోని పలు గృహాల్లో ఎలక్ట్రానిక్ వస్తువులు కాలి పోయినట్లు స్థానికులు తెలిపారు.

ద్విచక్ర వాహనదారుడి మృతి

భట్టిప్రోలు (కొల్లూరు) అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందినట్లు ఎస్ఐ ఎం.శివయ్య బుధవారం తెలిపారు. రేపల్లె మండలం బేతపూడి గ్రామానికి చెందిన ఆలూరి మహేష్‌బాబు (28) మంగళవారం అమృతలూరులో ఉన్న తన ద్విచక్ర వాహనాన్ని తీసుకుని స్వగ్రామానికి బయలుదేరాడు. ఓలేరు సమీపంలోకి చేరుకోగా ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తండ్రి రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్ల ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు..

యడ్లపాడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : మండలంలో తిమ్మాపురం పరిధిలోని జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. బాపట్ల జిల్లా మార్టూరు మండలం జొన్నతాలి గ్రామానికి చెందిన శివరాత్రి హనుమంతరావు(60) మంగళవారం అన్న కుమారుడితో కలసి చిలకలూరిపేటలోని ఓ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వచ్చాడు. మధ్యలో బహిర్భూమికని బయటకు వచ్చిన ఆయన.. తిమ్మాపురం గ్రామ పరిధిలోని రహదారిపై నడుచుకుంటూ చిలకలూరిపేట వెళ్లేందుకు డివైడర్‌ను దాటుతున్నాడు. ఈక్రమంలో గుంటూరు నుంచి ఒంగోలు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం హనుమంతరావును ఢీకొట్టింది. దీంతో అతను తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించారు. సాంకేతిక ఆధారాల సహాయంతో ప్రమాదానికి కారణమైన లారీని గుర్తించి సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. మృతుని అన్న కుమారుడు మురళీకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

29,896 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 31,782 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 29,896 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణీ కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 8,464 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	10000	12500
334	10000	14800	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	14500	334	10500	15000
273	---	---	నెంబరు. 5	10000	14800
341	10000	15500	273	10000	13500
4884	---	---	341	10000	15800
సూపర్ 10	---	---	సూపర్ 10	---	---
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15300	తేజ	10000	15000
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15200
బ్యాడిగి	10500	15500	దేవనూరు డీలక్స్	10500	14700
దేవనూరు డీలక్స్	10000	14500	తాలుకాయలు	5000	8000

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

ఇద్దరు యువతుల హత్యకేసు కొట్టివేత

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): 2017 ఆగస్టు 15న అమరావతిలో హత్యకు గురైన మసక లక్ష్మీ, బత్తుల ఫణి కేసుకు సంబంధించి గుంటూరు నాలుగో అదనపు జిల్లా జడ్జీ శరత్‌బాబు సాక్షాధారాలు లేకపోవడంతో కేసును బుధవారం కొట్టివేశారు. ఈ హత్యకు సంబంధించి అప్పటి సీఐ మురళీకృష్ణ కేసు దర్యాప్తు చేసి వైకుంఠపురం గ్రామానికి చెందిన పల్లా సత్యనారాయణపై 302, ఎస్సీ ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితుడు తరపున న్యాయవాది మేకల హనుమంతరావు కోర్టులో తన వాదనలు వినిపించగా పబ్లిక్ ప్రాసిక్యూషన్ తరఫున నిందితునిపై సాక్ష్యాలు నిరూపించ లేకపోవడంతో నిర్దోషిగా న్యాయస్థానం నిర్ధారించి కేసు కొట్టివేసింది. ఇద్దరు యువతులను గుర్తుతెలియని వ్యక్తులు హత్యచేసి నరుకుళ్లపాడు రోడ్‌లోని వాగులో పడవేశారు. అప్పట్లో ఈ సంఘటన జిల్లా వ్యాప్తంగా సంచలనాన్ని కల్గించింది. హత్యకేసు కొట్టివేత సమాచారం వాస్తవమేనని సీఐ అచ్చియ్య తెలిపారు.

సమీక్షలు వాయిదా

పిడుగురాళ్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారానికై మండలస్థాయి అధికారులతో గురు, శుక్రవారాల్లో నిర్వహించనున్న సమీక్షా సమావేశాలు తుఫాన్ కారణంగా వాయిదా వేసినట్లు గురజాల ఆర్‌డీఓ మురళీకృష్ణ తెలిపారు. తుఫాన్ ప్రభావం తగ్గుముఖం పట్టాక దాచేపల్లి, పిడుగురాళ్ల మండలాల పరిధిలో ప్రత్యేక ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు.

వర్షం కారణంగా ప్రజావేదిక...

దాచేపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): దాచేపల్లిలో వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన ప్రజా వేదిక కార్యక్రమం వర్షం కారణంగా రద్దు చేసినట్టు బుధవారం దాచేపల్లి తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి కార్యక్రమాన్ని త్వరలో తెలియజేస్తామని వివరించారు.

తహసీల్దార్‌కు వినతి

అచ్చంపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక పథకాన్ని అమలు జరపాలని సీఐటీయూ పల్నాడు జిల్లా నాయకుడు జీ రవిబాబు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ నాగరాజుకు వినతి పత్రం అందించారు. ఇసుక కార్మికుల యూనియన్‌లకు రీచ్‌లలో కొందరు ఆటంకం కలిగిస్తున్నారని, అలాంటి ఆటంకాలు తొలగించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రైతు సంఘం నాయకులు ఆర్ వెంకటేశ్వర్లు, కౌలు రైతు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు హనుమంతరావు, కేకే రెడ్డి తదితరులు ఉన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 43.54 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 25,230 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600, లీకుల ద్వారా 400, మొత్తం 17వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

రోడ్డు విస్తరణ పనులు త్వరలో ప్రారంభం

రెంటచింతల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): 167 జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా రెంటచింతలలో ఏర్పాటుచేయబోయే సర్వీస్ రోడ్డును ఎన్‌హెచ్ ఈఈ సంజీవరాయుడు, డీఈ ఎన్.శ్రీనివాసరావు, ఏఈ ప్రకాశరావు బుధవారం పరిశీలించారు. జాతీయ రహదారి నుంచి రెంటచింతల గ్రామంలోకి రావడం అక్కడ నుంచి హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ వద్ద జాతీయ రహదారిలోకి వాహనాలు ఎక్కేంత వరకు 4.1 కి.మీ. మేర రహదారిని విస్తరించనున్నారు. ఇప్పుడు రెంటచింతలలో 7 మీటర్ల తారు రోడ్డు వుందని దానికి ఇరువైపులా 5 మీటర్ల మేర రోడ్డు విస్తరణ వుంటుందన్నారు. మాచర్లనుంచి గురజాలకు 13.17 కి.మీకు(సర్వీసు రోడ్డు) టెండర్లు పూర్తయ్యాయన్నారు. త్వరలో పనులు ప్రారంభించబోతున్నట్లు చెప్పారు.

అవినీతి నిర్మూలనలో డ్వాక్రా మహిళలు భాగస్వాములవ్వాలి




కార్యక్రమంలో మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారి రాంబాబు

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జాతీయ సమైక్యత అవినీతి నిర్మూలనలో డ్వాక్రా సంఘాల మహిళలు భాగస్వాములు కావాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ విజిలెన్స్ అధికారి ఈదర రాంబాబు కోరారు. బుధవారం స్థానిక వెలుగు మండల సమైక్య కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు నిర్వహించిన సమావేశంలో రాంబాబుతో పాటు గుంటూరు రీజినల్ మేనేజర్ చిరుమామిళ్ల శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని మహిళలు ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాల పట్ల జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో అమరావతి, అత్తలూరు, నెమలికల్లు బ్రాంచ్‌ల మేనేజర్లు అనిల్‌కుమార్, కళ్యాణ్, జగదీష్ కుమార్‌లతో పాటు విజిలెన్స్ కోఆర్డినేటర్ సైదులునాయక్ పాల్గొన్నారు.

అదనపు కట్నం వేధింపులపై వివాహిత ఫిర్యాదు

పెదకూరపాడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం తనను వేధిస్తున్నారని మండలంలోని 75 తాళ్ళూరు గ్రామానికి చెందిన బెల్లంకొండ వైష్ణవి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ గిరిబాబు తెలిపారు. భర్త గోపీకృష్ణ, అత్తమామలు అధిక కట్నం కోసం శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వివరించారు.

గుంటూరు ఎస్పీని కలసిన కన్నా



గుంటూరు ఎస్పీ వకుల్ జిందాల్‌ను కలసిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వకుల్‌జిందాల్‌ను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ బుధవారం మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతోపాటు ఆయన కుమారుడు గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు ఉన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

పిడుగురాళ్ల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రవాణాశాఖ కార్యాలయంలో బుధవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. నరసరావుపేటకు చెందిన రామలింగారెడ్డి మాక్స్‌విజన్ కంటి హాస్పటల్ వైద్యులు రవాణాశాఖ అధికారులకు, సిబ్బందికి, కుటుంబసభ్యులకు కంటివైద్యపరీక్షలు నిర్వహించారు. సుమారు 81మందికి పైగా వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి ఆరోగ్యశ్రీ, హెల్త్ కార్డు, ఈహెచ్ఎస్ కార్డు వున్నవారికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్లు చేస్తారని రవాణాశాఖ అధికారి రాంబాబు తెలిపారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న నరసరావుపేట రామలింగారెడ్డి హాస్పటల్ కంటి వైద్యులు

కల్తీ మద్యం ఫార్ములా కేంద్రం.. తాడేపల్లి జగన్ ప్యాలెస్



• ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యం ఫార్ములా తయారీకి కేంద్ర బిందువు తాడేపల్లిలోని జగన్ ప్యాలెస్ అని ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ ఆరోపించారు. గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నకిలీ మద్యం వ్యవహారంలో అసలు నిందితులు వైసీపీ నేతలేనని, ఇప్పుడు వారి పాపాలను కూటమి ప్రభుత్వంపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. జే బ్రాండ్ల పేరుతో రాష్ట్ర ప్రజలకు అమ్మిన నాసిరకం మద్యానికి 30 వేల మంది ప్రాణాలు కోల్పోగా లక్షలాది మంది అనారోగ్యానికి గురయ్యారని ఆరోపణలు గుప్పించారు. జగన్ ఐదు సంవత్సరాల పాలనలో లిక్కర్ మాఫియాను నడిపి రూ.3,500 కోట్లను దోచుకున్నారని విమర్శించారు. చిత్తూరు జిల్లా ములకల చెరువు ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లో కల్తీ మద్యం కేసులు కూడా వైసీపీ కుట్రలో భాగమేనన్నారు. మద్యం మాఫియాలో మిథున్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వంటి నేతలు నిందితులుగా ఉన్నా వారిని వైసీపీ నుంచి సస్పెండ్ చేయడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం పార్టీ నిబద్ధతను నిరూపిస్తూ కల్తీ మద్యం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న దాసరిపల్లి జయ చంద్రారెడ్డి, కట్టా సురేంద్ర నాయుడుని టీడీపీ నుంచి సస్పెండ్ చేశారన్నారు. విజయవాడలో వైసీపీ నేత మల్లాది విష్ణుకు చెందిన బార్‌లో కల్తీ మద్యం తాగి ఆరుగురు చనిపోయినా జగన్ అతనికి పార్టీ టిక్కెట్ ఇచ్చారని, ఆ నాయకుడి పై ఎటువంటి చర్యలు తీసుకోలేదని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రజలు వైసీపీ ఆడే నాటకాలను నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు.

పంట పొలాల పరిశీలన

మాచర్ల రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయవరంలో బుధవారం పత్తి, మిరప పంటపొలాలను జిల్లా వ్యవసాయ సలహా, సాంకేతిక కేంద్రాల వ్యవసాయశాస్త్రవేత్త ఎం నగేష్ పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. పత్తిపంటలో గులాబి రంగు, తెల్లదోమ, పచ్చదోమ నివారణకు సూచనలు చేశారు. కార్యక్రమంలో మాచర్ల సహాయ వ్యవసాయ సంచాలకులు వీ జగదీశ్వరరెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారి ఎం మార్కండేయులు, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

● దుర్గి: మండలంలోని ఓబులేశునిపల్లెలో కంది, జూటు పొలాలను జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ ఎం నగేష్, విస్తరణ విభాగం ప్రధాన శాస్త్రవేత్త పీవీ సత్యగోపాల్‌లు పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కంది, జూటు పంటల్లో తెగుళ్లనివార ణకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏవో వై అమీర్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు చందు, అశోక్ పాల్గొన్నారు.

● అచ్చంపేట: మండలంలోని చిగురుపాడులో జిల్లా వ్యవసాయ అధికారి ఎం జగ్గారావు మండలంలోని పంటలను పరిశీలించారు. పంటల నమోదు ప్రక్రియను పర్యవేక్షించారు. ముందుగా చిగురుపాడు గ్రామ రైతులతో మాట్లాడి పత్తి సాగుచేసే ప్రతిపొలాన్ని నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం చింతపల్లిలో పంటనమోదు ప్రక్రియను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పంట నమోదు గడువు ఈనెల 25వ తేదీ వరకు ఉందని, ఈ లోపు సాగుచేసిన పంటలన్నీ యాప్‌లో నమోదుచేయాలని సూచించారు. అనంతరం అచ్చంపేటలోని ఎరువులు, పురుగుమందుల షాపులను తనిఖీ చేశారు. ఏవో పీ వెంకటేశ్వర్లు, టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, గంధం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అచ్చంపేట: చిగురుపాడులో పత్తి పంటను పరిశీలిస్తున్న డీఏవో జగ్గారావు, టీడీపీ నాయకులు

పేదవాడి ఆరోగ్యమే కూటమి లక్ష్యం

• ఎమ్మెల్యే యరపతినేని



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం పట్టణ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గం వ్యాప్తంగా మంజూరైన రూ.42,34,920 సీఎంఆర్ఎఫ్ చెక్కులను 51మందికి ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక దరఖాస్తు చేసుకున్న ప్రతి పేదవాడికి సీఎంఆర్ఎఫ్ మంజూరవుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేవీ సుబ్బారావు, పిల్లి చెన్నారావు, పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, బాబావలి, వున్నం ఆంజనేయులు, మల్లెల ఆదినారాయణ, ఎల్‌వీఆర్, జొన్నలగడ్డ శ్రీను, మందా డేవిడ్, సయ్యద్ అమీర్ అలి, కామిశెట్టి రమేష్, ఖాశింసైదా, పొదర్తి రాజేశ్వరి, రామారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలి



75 తాళ్ళూరు పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మావతి

పెదకూరపాడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా గర్భిణులకు అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పద్మావతి అన్నారు. మండలంలోని 75తాళ్ళూరు పీహెచ్‌సీని బుధవారం ఆమె తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రుల్లో సిజేరియన్ ప్రసవాలు తప్పనిసరైతే చేయాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. చిన్నవయస్సులో బాలికలకు వివాహాలు జరగకుండా చూడాలని ఆమె సిబ్బందికి సూచించారు. వ్యాధి నిరోధక టీకాలు జరిగే విధానాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఆస్పత్రిలో మందులన్నీ అందుబాటులో ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ పరిమళ, పీహెచ్ఎన్ డాక్టర్ దుర్గాకుమారి, సూపర్‌వైజర్లు దిలీప్‌కుమార్, శ్రీనివాసరావు, సుభాషిణిపాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

గురజాలటౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వపాఠశాలల్లో గురువారం నుంచి ఈనెల 30వ తేదీవరకు ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గౌసియా బేగం బుధవారం తెలిపారు. ఈ క్యాంపులు నిర్వహించే సిబ్బంది 8 రోజులపాటు పాఠశాలల్లో అందుబాటులో ఉంటారన్నారు. ఈ క్యాంపులో స్కూల్ పిల్లల కోసం ఆధార్ నమోదు, అప్‌డేట్ వంటి సేవలను అందిస్తారన్నారు. మరిన్ని వివరాలకు మీ గ్రామాల్లోని సచివాలయాల్లో సంప్రదించాలన్నారు.

నిత్యావసరాలు సక్రమంగా పంపిణీ చేయాలి

మాచర్ల రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రేషన్‌డీలర్లు నిత్యావసరాలు సక్రమంగా పంపిణీచేయాలని తహసీల్దార్ కిరణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల రెవెన్యూ కార్యాలయంలో ఆయన రేషన్ డీలర్లతో సమావేశమై పలు సూచనలు చే శారు. పెండింగ్ స్మార్ట్ కార్డులు పంపిణీని వేగవంతం చేయాలన్నారు.

జూదరుల అరెస్టు

మాచర్ల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రైల్వేఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపం జగనన్నకాలనీలోని ఓ గృహంలో పేకాడుతున్నట్లు సమాచారంతో పట్టణ పోలీసులు బుధవారం రాత్రి దాడిచేశారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారినుంచి రూ.16వేల నగదు, 4 సెల్‌ఫోన్లు, ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసుదర్యాప్తుచేస్తున్నారు.

27న సీఎం చంద్రబాబు వెల్దుర్తి రాక

మాచర్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తనయుడు గౌతమ్ రెడ్డి వివాహమహోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాల్గొననున్నట్లు తెలుస్తోంది. వెల్దుర్తిలో ఈనెల 27వ తేదీన గౌతమ్‌రెడ్డి వివాహ వేడుకలు జరుగనున్నాయి. ఇటీవల ఎమ్మెల్యే జూలకంటి ముఖ్యమంత్రిని కలిసి వివాహవేడుకకు ఆహ్వానించారు. ఈ వేడుకకు సీఎం హాజరుకానున్నట్లు సీఎంవో కార్యాలయం నుంచి బుధవారం అధికారికంగా షెడ్యూల్ విడుదలకావడంతో ఏర్పాట్లను టీడీపీశ్రేణులు ముమ్మరంచేస్తున్నాయి.

అమరావతి మీదుగా ఇసుకలారీల రాకపోకలు నిలిపివేయాలి

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తుళ్లూరు మండలం నుండి ఇసుకలోడుతో వచ్చే భారీవాహనాలను అమరావతి గ్రామంలో నుండి రాకుండా నిలిపివేయాలని అమరావతి సీఐ అచ్చియ్యకు సీపీఎం నాయకులు బుధవారం వినతి పత్రం అందజేశారు. అమరావతి వెలుపల ఔటర్ రోడ్ ఉన్నా లారీలు అమరావతి ప్రధానవీధి గుండా వెళ్తున్నాయని వీటివల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉందని వారు తెలిపారు. క్రోసూరు వైపు నుండి వచ్చే ఇసుక వాహనాలను పంచాయతీ కార్యాలయం వద్దనుండి ఆరుడొంకలబావి వైపు నడిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బీ సూరిబాబు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎడతెరపిలేని వర్షం
ఆందోళనలో అన్నదాతలు

ముప్పాళ్ళ, దాచేపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో ఎడతెరిపి లేకుండా బుధవారం వర్షం కురిసింది. గత వారంరోజులుగా గ్రామాలలో కురుస్తున్న వర్షాలకు పంటలకు నష్టంవాటిల్లే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. పత్తిపంట కాయపగిలే దశలో ఉండటం వలన పత్తి కుళ్లిపోయే ప్రమా దం ఉంది. అప్పుడే నాటిన మిర్చిమొక్కలు కుళ్లడుతెగులు ఏర్పడి ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. పసుపుపైరు కూడా మొక్కలు కుళ్లిపోయే ప్రమాదం ఉందన్నారు. వరిపంటకు ఆకుచుట్టు పురుగు, సుడిదోమ, అగ్గితెగులు వంటి వాటితో మొక్కలు గిడసబారి ఎరుపెక్కుతున్నాయి. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని ఏఓ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ముప్పాళ్ళ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఈనెల 23వ తేదీ గురువారం మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ పి.రత్నం బుధవారం తెలిపారు. సమావేశానికి సభ్యులు, అన్ని శాఖల అధికారులు రావాలని కోరారు. ఎంపీపీ పద్మావతిపై సభ్యులు అవిశ్వాస తీర్మానంపై ఆర్డీఓకు వినతిపత్రం అందజేయడం, ఈనెల 28న అవిశ్వాస తీర్మానంపై సమావేశం ఏర్పాటుచేయనున్నారు. మండలంలోని 12 ఎంపీటీసీలకు 11 మంది వైసీపీ, ఒకరు జనసేన ఉన్నారు. సార్వత్రిక ఎన్నికలముందు ఇద్దరు టీడీపీ కండువా కప్పుకోగా, ఎన్నికల అనంతరం మరో ఇద్దరు టీడీపీలో చేరారు. మరో ఇద్దరు ఎంపీటీసీలు టీడీపీ నాయకులతో టచ్‌లో ఉన్నారని తెలుస్తుంది. కాగా వైసీపీ ఎంపీటీసీ ఒకరు మృతిచెందారు. అవిశ్వాసంలో ఎవరు ఎటు ఓటువేస్తారో తెలియని పరిస్థితి. మండలంలోని అధికారపార్టీ ప్రధాన నాయకులు ఇదే అం శంపై కుస్తీ పడుతున్నారు. ఈ నేపథ్యంలో జరగబోయే సర్వసభ్య సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది.

జాబ్ కార్డు ఉన్నవారికి ఈకేవైసీ తప్పనిసరి

గురజాలటౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరూ ఈకేవైసీ తప్పక చేయించుకోవాలని ఎంపీడీవో గౌసియాబేగం బుధవారం తెలిపారు. మండలంలోని ఉపాధిహామీ కింద జాబుకార్డు ఉన్న కూలీల దగ్గరకు ఫీల్డ్ అసిస్టెంట్లు వస్తారని, వాళ్లు వచ్చినప్పుడు ఇంటి వద్ద లేకుంటే సచివాలయాల్లో కూడా ఈకేవైసీ చేయించుకోవచ్చని చెప్పారు.

పంట అవశేషాలను కుళ్లబెట్టుకోవాలి

● జిల్లా శిక్షణా కేంద్రం వ్యవసాయ అధికారి అరుణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా శిక్షణా కేంద్రం వ్యవసాయ అధికారి అరుణ తదితరులు

మాచవరం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సేంద్రీయ పద్ధతిలో భూసారాన్ని పెంపొందించుకోవాలంటే పచ్చిరొట్ట పైర్లు, పంట అవశేషాలను కాల్చివేయకుండా కుళ్లబెట్టుకోవాలని జిల్లా శిక్షణా కేంద్రం వ్యవసాయ అధికారి ఎం అరుణ రైతులకు సూచించారు. బుధవారం మాచవరం సచివాలయంలో భూమి ఆరోగ్యం, భూసారంపై రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ జీవన ఎరువులు వాడకం వల్ల రసాయన ఎరువుల వాడకం 20 శాతం తగ్గుతుందన్నారు. ఏవో రామమ్మ మాట్లాడుతూ ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకుంటే వాటి ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. అనంతరం రైతులకు పురుగు మందులు, విత్తనాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా శిక్షణా కేంద్రం విస్తరణ అధికారి కరీమూన్, వీఏఏ ప్రియాంక పాల్గొన్నారు.

గతంలో ఎన్నడూ చూడని అభివృద్ధి

● టీడీపీ యువనేత సాయి వివేకానందరెడ్డి

వెల్దుర్తి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ హయాంలో మాచర్ల నియోజకవర్గ ప్రజలు గతంలో ఎన్నడూ చూడని అభివృద్ధిని చూస్తున్నారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తనయుడు, టీడీపీ యువనేత జూలకంటి సాయివివేకానందరెడ్డి అన్నారు. మండలంలోని ఉప్పలపాడులో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డుకు బుధవారం టీడీపీ యువనేత జూలకంటి అక్కిరెడ్డితో కలిసి భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, ఏఈ పాశం శ్రీనివాసరెడ్డి, టీడీపీ నేతలు నర్రా గురవారెడ్డి, కేసిరెడ్డి హనిమిరెడ్డి, మల్లికార్జునరావు, దొండపాటి శ్రీను, టీడీపీ నేతలు పాల్గొన్నారు.



భూమిపూజలో టీడీపీ యువనేత సాయి వివేకానందరెడ్డి

జనసేనను బూత్ స్థాయి నుంచి బలోపేతం చేద్దాం

● జిల్లా కార్యదర్శి హరి



మాట్లాడుతున్న జనసేన జిల్లా కార్యదర్శి హరి

మాచర్ల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేద్దామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పులి హరి అన్నారు. బుధవారం పట్టణ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కాలంలో మాచర్ల నియోజకవర్గంలో, రాష్ట్రంలో సుపరిపాలన, అభివృద్ధి, సంక్షేమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో పయనింపజేస్తున్నారన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇటీవల కందుకూరులో లక్ష్మీనాయుడు హత్యను జనసేన పార్టీ ఖండించిందన్నారు. రాజకీయ లబ్ధికోసం వైసీపీ చేస్తున్న శవరాజకీయాలను తిప్పి కొట్టామన్నారు. సమావేశంలో జనసేన మండల అధ్యక్షుడు తోటకూర శ్రీనివాసరావు, అరిగెల వెంకట్రామయ్య, కొప్పుల వెంకటరమణ, రాచమళ్ల నజూర్ యాదవ్, వెండి నాగశేషయ్య, భీమా అమరయ్య, రుద్రాల రవి, కొత్త గోపి, బండి నాసరయ్య, ఆవుల కోటయ్య, బూసా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు పంచాయతీల నిధులు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ కే సతీష్

నకరికల్లు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు పంచాయతీల్లోని నిధులను కేటాయించి సహకరించాలని ఎస్ఐ కే సతీష్ కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మేచారపు అనురాధ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో గుండ్లపల్లిలో యూరియా కొంతమందికే అందిందని, మిగితా యూరియా పక్కదారి పట్టిందని కో-ఆప్షన్ సభ్యుడు షేక్ హుస్సేన్ ఆరోపించారు. కండ్లకుంట అంగన్‌వాడీ కేంద్రానికి, భవన నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయని, పనులు ఇంకా ప్రారంభించలేదని పీఆర్ ఏఈ సురేష్ తెలిపారు. ఉపాధి శ్రామికులకు ఈకేవైసీ చేయించాల్సి ఉండగా నకరికల్లులో అధికారులు తిప్పుకుంటున్నారని సభ్యులు ఆరోపించారు. మినీగోకులం షెడ్లు మంజూరయ్యాయని, ఆసక్తిగల రైతులు ఉపయోగించుకోవాలని ఏపీవో ప్రసాదు తెలిపారు. విద్యుత్ సమస్య నకరికల్లులో తీవ్రంగా ఉందని, ప్రభుత్వ కార్యాలయాల్లోను పనులు చేసుకోవటానికి ఇబ్బంది ఉందని అధికారులు ఏఈ సుచరిత దృష్టికి తెచ్చారు. ఈ విషయమై సుచరిత మాట్లాడుతూ విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. గ్రామ పంచాయతీల ఆమోదం లేకుండానే ఉపాధి పనులు చేపడుతున్నట్టు సభ్యులు ఆరోపించారు. ఉపాధి పనులకు సంబంధించి గ్రామసభ సమావేశాలను సర్పంచ్‌లకు, ఎంపీటీసీ సభ్యులకు తప్పనిసరిగా తెలుపుతామని ఎంపీడీవో జీ కాశయ్య తెలిపారు. నకరికల్లులో హెల్త్ సెంటర్ నిర్మాణానికి వెంటనే స్థలాన్ని చూపిస్తామని తహసీల్దార్ కే పుల్లారావు తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ఎం ప్రవీణ్ కుమార్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాలధారులకు అన్నదాన సేవా కార్యక్రమం

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) మండలంలోని ధరణికోట విఘ్నేశ్వర అయ్యప్ప భక్త సమాజం ఆధ్వర్యంలో 16వ సంవత్సరం అన్నదాన కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. విఘ్నేశ్వరస్వామి ఆలయం సమీపంలోని కల్యాణమండపంలో ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అయ్యప్ప, భవానీ, గోవిందుని మాలధారులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొనాలని నిర్వాహకులు తెలిపారు. అమరావతి సందర్శించే మాలధారులకు కూడా అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

● అచ్చంపేట: అచ్చంపేటలోని శివాలయంలో శ్రీఅచ్చమ్మ పేరంటాళ్ళ అమ్మ మణికంఠ అన్నదాన సేవాసంఘం ఆధ్వర్యంలో బుధవారం నుంచి డిసెంబరు 1వ తేదీవరకు 41రోజులు మాలధారులందరికీ దాతల సహాయంతో అన్నదానం జరుగుతుందని సంఘం అధ్యక్షులు కోట నానికిషోర్ తెలిపారు. బుధవారం డాక్టర్ మామిళ్ళపల్లి మధుసూదనరావు ప్రారంభించారు.

● మాచర్ల రూరల్: దానగుణం మానవత్వానికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రామచంద్రారెడ్డి అన్నారు. కార్తీకమాసం సందర్భంగా పట్టణంలోని రామాలయంలో నడకబృందం ఆధ్వర్యాన అన్నసమారాధనను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నడకబృందం సభ్యులు రామ్మూర్తి, బి.కోటేశ్వరరావు, తిరుపతయ్య, వెంకటరెడ్డి, బ్రహ్మారావు, బి.రామారావు, వెంగళరెడ్డి, చీదెళ్ల వెంకటనారాయణ, కోటిరెడ్డి పాల్గొన్నారు.

● రెంటచింతల: కార్తీకమాసం సందర్భంగా సత్రశాల శ్రీగంగాభ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో అన్నదానం ప్రారంభించారు. అబ్బిరెడ్డి మురళీకుమారి, శివయ్య, సైదమ్మ దంపతులు సుమారు 875మందికి అన్నదానం చేశారు. మాలధారులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. వివిధ రకాల పూజాకార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్‌బోర్డు చైర్మన్ శివయ్య, మెంబర్లు, ఈవో గాదే రామిరెడ్డి, ప్రభురాజుయాదవ్, నీలం మల్లయ్య, గొట్టం శ్రీనివాసరెడ్డి, లింగయ్యయాదవ్, సుమంత్‌రెడ్డి, రామకృష్ణ, నల్లబిరుదు నరసింహారావు పాల్గొన్నారు.

● గురజాలటౌన్: మండలంలోని గోగులపాడు శ్రీనీలకంఠేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం నుంచి 41 రోజులపాటు మాలధారులకు సద్ది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

దేవాలయాల్లో ఆకాశ దీపాలు

గురజాలటౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ప్రారంభం కావడంతో మండలంలోని దైద అమరలింగేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం ఆకాశదీపాన్ని వెలిగించారు. కార్తీకమాసం మొదటిరోజు సందర్భంగా దేవస్థానానికి భక్తులు తెల్లవారుజామునుంచే పోటెత్తారు. కృష్ణానదిలో స్నానమాచరించి స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని ఈవో పూర్ణచంద్రరావు తెలిపారు.

● క్రోసూరు: కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా నుంచి క్రోసూరు మండలంలోని శివాలయాల్లో ధ్వజస్తంభాలకు ఆకాశదీపాలు ఏర్పాటుచేశారు. ఆకాశదీపాల ప్రాశస్త్యాన్ని గురించి పండితులు వివరించారు.

● మాచవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో కార్తీకమాస పూజలు ప్రారంభమయ్యాయి. ఆయా గ్రామాల శివాలయాల్లో తెల్లవారుజాము నుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు చేశారు. దీపాలు వెలిగించి దేవుని ఆశీస్సులు పొందారు.

నాడు వైభోగం నేడు విషాదం!





- బాధల్లో 'బంగారు' బతుకులు!
- రెడీమేడ్, మాల్స్ రాకతో పనులపై ప్రభావం
- ధర కొండెక్కడంతో పరిస్థితి తలకిందులు
- రోడ్డుపాలవుతున్న స్వర్ణకారుల కుటుంబాలు
- స్విగ్గీ, డెలవరీబాయ్‌లుగా వెళుతున్న దుస్థితి
- 15,000 కుటుంబాలపై తీవ్ర ప్రభావం

మంగళగిరి మండలం ఆత్మకూరుకు చెందిన ఒక స్వర్ణకారుడు ముప్పై ఏళ్లుగా స్వర్ణకార వృత్తిలో ఉన్నాడు. చేతినిండా పని ఉండడంతో జేబునిండా సంపాదించాడు. కానీ ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది. గడిచిన రెండేళ్లుగా బంగారం ధర పెరగడంతో పనులు తగ్గిపోయాయి. పనులు వస్తాయిలే అన్న నమ్మకంతో అప్పులు చేసేశాడు. తీరా అవి తీర్చడానికి రూ. 70 లక్షల విలువ చేసే ఇంటిని అమ్మేసుకుని రోడ్డున పడ్డాడు. మంగళగిరి పట్టణానికి చెందిన మరో యువకుడు ఆరేళ్ల క్రితం స్వర్ణకార వృత్తిలోకి వచ్చాడు. కొంతకాలం ఫర్వాలేదనిపించింది. గత రెండేళ్లుగా పని లేకుండా పోయింది. ఆరు నెలలపాటు పని రాలేదు. దీంతో స్విగ్గీ బాయ్‌గా వెళుతున్నాడు. ఇది సగటు స్వర్ణకారుల పరిస్థితి. రెండేళ్లుగా పనులు లేకపోవడంతో సమస్తం కోల్పోయి అత్యంత దుర్భర జీవితాన్ని గడుపుతున్న దుస్థితి.



గుంటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు స్వర్ణకారుడంటే ఎంతో గొప్ప పేరుండేది. నిన్న మొన్నటి వరకూ కూడా ఆ గొప్పదనం అలాగే కొనసాగింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో పోటీపడేలా అత్యంత విలాసవంతమైన జీవితాలు వారివి.

అప్పట్లో వారి నెలసరి ఆదాయం ఐదంకెల సంఖ్యనుదాటి ఆరెంకెల వరకూ ఉండేది. బంగారపు పనిలో నైపుణ్యం వస్తే చాలు కోట్లు సంపాదించవచ్చు అన్నంతగా ఆ ఒరవడి కొనసాగింది. ఫలితంగా మంగళగిరి పరిసర ప్రాంతాల్లో ప్రతి చేనేత కుటుంబం నుంచి స్వర్ణ కళాకారులు తయారయ్యారు. విజయవాడ, మంగళగిరి, తెనాలి, చీరాల పరిసర ప్రాంతాలు కేంద్రంగా ఈ స్వర్ణకార సమూహం రాష్ట్రంలోనే కాదు.. దేశంలోని అన్ని మార్కెట్లను సొంతం చేసుకుంది. అంతటి వైభోగాన్ని అనుభవించిన స్వర్ణకారులు నేడు కడు దయనీయ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.

మూలిగే నక్కపై తాటిపండులా ధరల పెరుగుదల

రెండేళ్లుగా బంగారం ధర కనీవినీ ఎరుగనీ రీతిలో పెరుగుతోంది. రెండేళ్ల క్రితం గ్రాము బంగారం ధర రూ.5వేలు ఉండగా అది ఇప్పుడు రూ.13వేలకు చే రింది. అంటే దాదాపు 160 శాతం ధర పెరిగింది. దీంతో

● రెడీమేడ్స్‌తో ప్రభావం

గుంటూరు జిల్లాలో సుమారు 15 వేల కుటుంబాలు స్వర్ణకార వృత్తిపై ఆ ధారపడి ఉన్నాయి. నాలుగు దశాబ్దా లుగా సానుకూల పరిస్థితి ఉండడంతో మంగళగిరి, తెనాలి, చీరాల పరిసర ప్రాంతాల చేనేత కార్మికుల కుటుంబాలన్నీ స్వర్ణకార వృత్తివైపు మొగ్గు చూపాయి. పదేళ్ల క్రితం వరకూ పరిస్థితి బాగానే ఉంది. తొలినాళ్లలో స్వర్ణకారుల స్వర్ణయుగం నడిచింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగితో సమానంగా ఆదాయాన్ని గడించారు. సొంత ఇళ్లుకూడా నేతకారుల కుటుంబాలు భారీ ఇళ్లను కూడా కట్టుకున్నారు. అత్యంత విలాసవంతమైన జీవితం గడిపారు. దాదాపు 20ఏళ్ల క్రితం బెంగాల్ నుంచి స్వర్ణకారుల వలసలు మొదలయ్యాయి. దీంతో స్థానిక స్వర్ణకారుల పనులపై ప్రభావం పడింది. మెల్లగా పనులు తగ్గడం మొదలయింది. దీనికితోడు ఇటీవల కాలంలో రెడీమేడ్ స్వర్ణాభరణాల తయారీ విపరీతంగా పెరిగింది. భారీ షాపింగ్ మాల్స్ కూడా ఈ రంగంలోకి ప్రవేశించాయి. ఆకర్షణీయమైన ప్రకటనలు, రాయితీలతో వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. దీంతో వారంతా పనులు చేయించుకోవడం మానేశారు. ఫలితంగా గత దశాబ్దకాలంగా పనులు లేక స్వర్ణకారులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక వేళ పనులు ఉన్నా తరుగు రూపంలో తీసుకునే ఆదాయం భారీగా పడిపోయింది. గతంలో 5శాతం తరుగుకింద తీసుకుంటుండగా, ఇప్పుడు 3 శాతం కూడా రాని పరిస్థితి ఏర్పడింది. దీంతో వారి ఆదాయానికి భారీ గండి పడింది.



సామాన్యులెవరూ బంగారం వైపు చూడడం లేదు. ధరల్లో అస్థిరత కారణంగా రేటు తగ్గుతుందేమో వేచి చూద్దాం అనే పరిస్థితి ఏర్పడింది. దీంతో స్వర్ణకారులకు పని తగ్గింది. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలకు కూడా స్వర్ణాభరణాల వైపు మొగ్గు చూపడంలేదు. ఒకవేళ తప్పని పరిస్థితుల్లో అవసరమైనా రెడీమేడ్ వైపు వెళుతున్నారు. అందువల్ల స్వర్ణకారులకు పనులే లేని పరిస్థితి నెలకొంది. దీంతో యువకులుగా ఉన్న స్వర్ణకారులు స్విగ్గీ, జొమేటో డెలివరీ బాయ్‌లుగా, ఫ్లిప్‌కార్టు, అమెజాన్, రేపిడో వంటి పనులకు వెళుతున్నారు. మరికొందరు నిర్మాణ కూలీలుగా మారుతున్నారు. అధిక ఆదాయాల వల్ల గతంలో విలాసవంతమైన జీవితాలకు అలవాటుపడినవారు చాలా మంది ఆ ఆదాయం కోసం బెట్టింగ్, ఆన్‌లైన్ రమ్మీ వంటి వాటి మోజులో పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. తెనాలికి చెందిన ఓ యువకుడు ఆరేళ్లు కష్టపడి స్వర్ణకార పనినేర్చుకున్నాడు. కానీ చేసేందుకు పనిలేకపోవడంతో కర్రీస్ పాయింట్ పెట్టుకున్నాడు. అదీ సరిగ్గా నడవలేదు. దీంతో బెట్టింగ్ బాట పట్టాడు. ప్రస్తుతం రూ. పది లక్షల అప్పుల్లో కూరుకుపోయాడు. ఆర్థికంగా స్థిరపడిపోయాం అనుకునేవారు కూడా వారికున్న ఇళ్లను, స్థలాలను అమ్ముకొని వీధిన పడే పరిస్థితి నెలకొంది. స్వర్ణకారుల స్థితిగతులపై ప్రభుత్వం దృష్టి సారించకపోతే పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉంది.

పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ ఆదర్శం

ఎంపీ లావు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి

యడ్లపాడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడుల ఆకర్షణలో రాష్ట్రం ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోందని, అందుకు చంద్రబాబుపై ఉన్న నమ్మకం, విశ్వసనీయత, నిబద్ధతలే కారణమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని సొలసలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలతో కలసి రూ.40లక్షలతో నిర్మించిన కల్వర్టు, పాఠశాల ప్రహరీ, సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి అండర్-14, అండర్-17 వాలీబాల్ పోటీలు, జిల్లా జట్ల ఎంపికల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి మాట్లాడుతూ విద్యాభ్యాసం పూర్తిచేసుకున్న ప్రతి విద్యార్థి కోసం ఉద్యోగాలు ఎదురు చూసేలా సీఎం చంద్రబాబు, విద్యాశాఖమంత్రి లోకేశ్ రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చేందుకు అవిశ్రాంత కృషి చేస్తున్నారన్నారు. పేద, రైతు కుటుంబాల నుంచి వచ్చిన ప్రతి విద్యార్థికి ఉన్నత భవిష్యత్తు అందించాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. విద్యార్థులు, యువత గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. జీవితంలో రాణించాలంటే విద్యార్థులు పరిణతితో ఆలోచించాలన్నారు. పెట్టుబడుల ఆకర్షించి పరిశ్రమలు పెట్టేలా ప్రోత్సహిస్తోంది రాష్ట్రంలోని యువత ఉపాధి, ఉద్యోగావకాశాల కోసమేనన్నారు. ఈ సందర్భంగా 2024-25 పదో తరగతి పరీక్ష ఫలితాల్లో తొలి మూడు స్థానాలు సాధించిన పాఠశాల విద్యార్థులకు రంగనాయక ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.10 వేలు, రూ.6 వేలు, రూ.4వేలు నగదు బహుమతులను అతిథులు ప్రదానం చేశారు. టీడీపీ నాయకులు వీరారెడ్డి, శ్రీనివాసరెడ్డి, సాయిబాబు, రఘురామారావు, రత్తయ్య, సుబ్బారావు, మండల అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ లావు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి

అమరేశ్వరాలయంలో కార్తీక మాస పూజలు



ఉసిరి చెట్టు కింద కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) పంచారామ పుణ్య క్షేత్రాల్లో ప్రసిద్ధమైన బాల చాముం డికా సమేత అమరేశ్వరాలయంలో కార్తీక మాస సందడి ప్రారంభ మైంది. బుధవారం భక్తులు పవిత్ర కృష్ణానదిలో పుణ్య స్నానమాచరించి ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగిం చారు. స్వామివార్లను దర్శించిన భక్తులకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఎన్‌టీఆర్ వైద్య సేవలు బంద్

(5వ పేజీ తరువాయి)

సాధన కోసం నిర్వాహకులు ఉద్యమిస్తు న్నారు. ప్రభుత్వం బకాయి విషయంలో స్పందిచకపోవడంతో ఆందోళనను ఉధృతం చేశా రు. ఇప్పటికే జిల్లా కేంద్రం నరసరావుపేటలో ఐఎంఏ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహిం చారు. తమ గోడును ప్రభుత్వానికి తెలియజేసేందుకు.. చలో విజయవాడకు పిలుపు నిచ్చారు. గురువారం విజయవాడ వేదికగా నెట్ వర్క్ ఆస్పత్రుల నిర్వాహకులు, వైద్యులు, వైద్య సిబ్బంది ధర్నా నిర్వహించనున్నారు.

పేరుకుపోయిన బకాయి..

బకాయిలు పేరుకుపోవడంతో.. నెలవారి ఖర్చులు రాక వైద్య సిబ్బందిని కుదించాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆసుపత్రుల నిర్వాహకులు చెబుతున్నారు. ప్రభుత్వ వ్యవహారంతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్య సిబ్బంది భవిష్యత్తు, ఉపాధి ప్రశ్నార్థకంగా మారనుంది. ఇప్పటికే కొన్ని ఆస్పత్రుల్లో సిబ్బందిని విధుల నుంచి తొలగిస్తుండటం గమనార్హం. రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత వైద్యం తాలూకా రూ.2,750 కోట్ల బకాయి చెల్లించాలని నెట్‌వర్క్ ఆస్పత్రుల యూనియన్ నేత డాక్టర్ నాగోతు ప్రకాష్ తెలిపారు. ఉచిన వైద్య సేవల ప్యాకేజ్‌ను 2009లో కొంత మేర పెంచారు. ఆ తదుపరి ఇప్పటి వరకు వైద్య ప్యాకేజ్ పెంచలేదు. కొత్తగా ప్రతి పౌరుడిగా వైద్య బీమా పథకం అమలు చేస్తామని ప్రభుత్వం చెప్పిన నేపథ్యంలో నెట్‌వర్క్ ఆస్పత్రుల డాక్టర్ల కొందరిని పథకం అమలులో భాగస్వాములను చేయాలని, ప్యాకేజ్‌లను పెంచే విషయంలో వైద్యులతో చర్చలు జరపాలని కోరారు. బకాయి విడుదల చేసే వరకు బంద్ కొనసాగిస్తామన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఉచిత వైద్యం బిల్లులను వెంటనే విడుదల చేయాలని డాక్టర్ ప్రకాష్ కోరారు.

హైస్పీడ్.. సిద్ధం

(5వ పేజీ తరువాయి)

మధ్య నిర్మించాలని నిర్ణయించింది. ఇందుకోసం రెండు ఎలైన్‌మెంట్లను ప్రతిపాదించింది. అయితే ఈ రెండింటిలో దాచేపల్లి మీదగానే అనువుగా ఉంటుందని ప్రతిపాదించింది. ఆప్షన్-1గా హైదరాబాద్ - మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ వే అండ్ తిరుపతి ఎయిర్‌పోర్టు కాగా ఆప్షన్-2ని ఎన్‌హెచ్-65 వెంట గ్రీన్ ఫీల్డ్ ఏరియాలో నుంచి ప్రతిపాదన చేసింది. ఎలైన్‌మెంట్ ఖరారు చేసే విషయంలో రాష్ట్ర ప్రభుత్వ సహకారాన్ని కోరింది. స్టేషన్లు నిర్మించాల్సిన ప్రదేశాల వద్ద 50 ఎకరాల చొప్పున భూమి అవసరం అవుతుంది. 30 నుంచి 40 ఏళ్ల అవుట్‌లుక్‌తో రాష్ట్ర దీర్ఘకాలిక మౌలిక సదుపాయాల బ్లూప్రింట్‌లో దీనిని చేర్చాలి. నిర్ణీత గడువు తేదీ లోపు ఫైనల్ లొకేషన్ సర్వే చేయనున్నందున ఎలాంటి జాప్యం లేకుండా సహకారం అందించాలని కోరింది.

మూడు జిల్లాల్లో భూసేకరణ..

- పల్నాడు జిల్లాలో 81 కిలోమీటర్ల పొడవునా ఈ హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్ నిర్మాణం జరగనున్నది. 7.130 కిలోమీటర్లు అటవీ భూమి కూడా ఉన్నది. దీంతో మొత్తంగా 243 హెక్టార్ల భూమి అవసరం అవుతుంది.
- గుంటూరు జిల్లాలో 66.45 కిలోమీటర్ల పొడవునా నిర్మాణం జరగనున్నది. ప్రాజెక్టు కోసం 199.35 హెక్టార్ల ప్రభుత్వ/ప్రైవేటు భూమి అవసరం ఏర్పడుతుంది.
- బాపట్ల జిల్లాలో 43.21 కిలోమటర్ల పొడవునా రైలు మార్గం నిర్మాణం జరగనున్నది. 129.63 హెక్టార్ల భూమి అవసరం అవుతుంది.

మారిపోనున్న ముఖచిత్రాలు

హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్ ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల ముఖచిత్రాలే మారిపోతాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా వేల మందికి ప్రత్యక్ష, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. పారిశ్రామిక ప్రగతికి ఈ ప్రాజెక్టు బాటలు వేయనున్నది. అటు చెన్నై, ఇటు హైదరాబాద్ మధ్య అమరావతి రాజధానులు అనుసంధానం అవుతాయి. శంషాబాద్, తిరుపతి, చెన్నై ఎయిర్‌పోర్టులకు సులభతరంగా చేరుకునేందుకు కనెక్టివిటీ లభిస్తుంది. హెచ్ఎస్ఆర్ స్టేషన్ల వద్ద 50 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేయనున్నందున అక్కడ వాణిజ్య కార్యకలాపాలు పెరుగుతాయి.

ముసురు.. ముంపు

(5వ పేజీ తరువాయి)

రేపల్లె, బాపట్ల ప్రాంతాల్లో వర్షం ప్రభావం ఎక్కువగానే చూపింది. పల్నాడు జిల్లాలోనూ వర్ష ప్రభావంతో వాణిజ్య పంటలకు నష్టం తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మరో నాలుగు రోజులు..

మరో నాలుగు రోజులు ఇదే పరిస్థితి ఉంటుందని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. గురు, శుక్రవారాల్లో అల్పపీడనం వాయుగుండంగా మారితే గాలుల తీవ్రత పెరుగుతుందన్నారు. 30నుంచి 70 సెంటీమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది.

జిల్లాలో మూడురోజులు భారీవర్షాలు

బాపట్ల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టరేట్‌లో 08643 -220226 నెంబర్‌తో కంట్రోల్ రూమ్ 24 గంటలు పనిచేస్తుందన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చిన తక్షణమే సంప్రదించవచ్చన్నారు.

అట్టహాసంగా శ్రీభ్రమర వార్షికోత్సవం

● సరికొత్త ఆలోచనతో పనిచేస్తామన్న సీఎండీ గల్లా రామచంద్రరావు

గుంటూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నిర్మాణ రంగంలో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న శ్రీ భ్రమర గ్రూప్ సంస్థ పదేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా వార్షికోత్సవాలు గుంటూరులోని ఏఎస్ కన్వెన్షన్‌లో బుధవారం అట్టహాసంగా జరిగాయి. నిర్మాణ రంగంలో కొత్తదనం సృష్టించాలన్న ఆశయంతో 2015 అక్టోబరు 22న స్థాపించిన శ్రీభ్రమర 10 ఏళ్ల విశ్వసనీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకొని ట్రస్ట్ ఎడికేడ్‌గా నిలిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ గల్లా రామచంద్రరావు మాట్లాడుతూ భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఆలోచనలతో ప్రేరణ పొంది, గ్రామాల్లోనూ నగర సౌకర్యాలు అందించాలన్న లక్ష్యంతో శ్రీ భ్రమర సంస్థ స్థాపించడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు గుంటూరు, కృష్ణా, ఎన్‌టీఆర్, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో 36కి పైగా అత్యద్భుతమైన రియల్ ఎస్టేట్ ప్రాజక్టులు విజయవంతంగా పూర్తి చేసి, 12వేలకు పైగా కుటుంబాల సొంతంటి కలను సాకారం చేసిందన్నారు. ఈ సుస్థిర ప్రస్థానం శ్రీ భ్రమర గ్రూప్‌ను ఏపీ రియల్ ఎస్టేట్ రంగంలో విశ్వసనీయ బ్రాండ్‌గా నిలబెట్టిందని తెలిపారు. వార్షికోత్సవం జరుపుకుంటున్న సందర్భంలో కేవలం సంవత్సరాలనే కాదు ప్రతి కస్టమర్ నమ్మకాన్ని, ప్రతి ఉద్యోగి కష్టాన్ని, ప్రతి మార్కెటింగ్‌మిత్రుడి అంకిత భావాన్ని గుర్తుచేసుకుంటున్నామన్నారు. ఈ దశాబ్ధ ప్రయాణం గొప్ప అనుభవం, గర్వకారణం, ముందున్న రోజుల్లో మరింత ఆలోచనలు, నాణ్యత, విశ్వసనీయతతో ప్రజల నమ్మకానికి తగ్గట్టు పనిచేస్తామన్నారు. వార్షికోత్సవ వేడుకలను పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, సీఎండీ గల్లా రామచంద్రరావు ప్రారంభించగా, కార్యక్రమంలో సంస్థ డైరక్టర్లు మారం చంద్రశేఖర్, యడ్లపల్లి మురళీకృష్ణ, రావెల గోపాలకృష్ణ, కల్వకుంట సాయిశంకర్, చెన్నంశెట్టి సతీష్ తదితరులున్నారు.



వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గల్లా మాధవి, శ్రీ భ్రమర సీఎండీ రామచంద్రరావు



ఆకట్టుకున్న కళాకారుల నృత్యాలు

నేటి నుంచి బిలియర్డ్స్ టోర్నీ

గుంటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ఎల్‌వీఆర్ క్లబ్‌లో గురువారం నుంచి ఏపీ బిలియర్డ్స్ అండ్ స్నూకర్ ర్యాంకింగ్ పురుషుల టోర్నమెంట్ ప్రారంభం కానుంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లను నిర్వాహకులు పూర్తిచేశారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వస్తున్న క్రీడాకారులతో ఎల్వీఆర్ క్లబ్‌లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ పోటీల నిర్వహణతో క్లబ్బు పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుందని పోటీల నిర్వహణ కార్యదర్శి పులివర్తి వెంకటేశ్వర రావు (అజార్) అన్నారు. బిలియర్డ్స్‌కు 38 ఎంట్రీలు, స్నూకర్స్‌కు 215 ఎంట్రీలు నమోదయ్యాయని తెలిపారు. క్లబ్బుకు చెందిన ఎస్.శంకర్రావు, ఎం.శ్రీనివాసరావు పోటీల్లో తలపడుతున్నారని చెప్పారు. పోటీల నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా క్లబ్బు కార్యదర్శి యాగంటి దుర్గారావు, అధ్యక్షులు మైనేని బ్రహ్మేశ్వరరావు, ఉపాధ్యక్షులు వణుకూరి శ్రీనివాసరెడ్డి, కోశాధికారి ఏల్చూరి వెంకటేశ్వర్లు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. ఏపీ బిలియర్డ్స్ అండ్ స్నూకర్స్ సంఘం ప్రతినిధులు పోటీలకు సాంకేతిక సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. పోటీలకు విచ్చేసిన క్రీడాకారులకు ఉచిత భోజన వసతి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పోటీల విజేతలకు 1.35 లక్షల ప్రైజ్ మనీ అందజేస్తామని వెల్లడించారు. ఈ పోటీలను గురువారం ఉదయం 9 గంటలకు శాప్ ఛైర్మన్ ఎ.రవి నాయుడు ప్రారంభిస్తారని అజార్ తెలిపారు.



బిలియర్డ్స్ టేబుల్‌పై సాధన చేస్తున్న క్రీడాకారుడు



మూడు జిల్లాల విద్యాశాఖ అధికారులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా, సీఈవో జ్యోతి బసు

స్టడీ మెటీరియల్ సమాచారం అందజేయాలి

గుంటూరు సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా 10వ తరగతి విద్యార్థులకు జిల్లా పరిషత్ నుంచి అందజేసే స్టడీ మెటీరియల్‌కు సంబంధించిన సమాచారాన్ని ఈ నెలాఖరులోగా అందజేయాలని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా అన్నారు. గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయ ఛాంబర్లో బుధవారం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల విద్యాశాఖ అధికారులతో జరిగిన సమావేశంలో ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ, స్టడీ మెటీరియల్ గత సంవత్సరం ఎంతమందికి పంపిణీ చేశారు, ఈ ఏడాది ఎంతమందికి పంపిణీ చేస్తున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. స్టడీ మెటీరియల్‌కు సంబంధించిన సమాచారాన్ని త్వరగా అందజేస్తే ముద్రించి డిసెంబరు నాటికల్లా పాఠశాలలకు అందజేస్తామని వెల్లడించారు. అదే విధంగా పాఠశాలల్లో న్యూట్రిషన్ వసతులు, సిలబస్ గురించి అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం జిల్లా పరిషత్తు నుంచి పంపిణీ చేసిన స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడిందని అన్నారు. తత్ఫలితంగా పల్నాడు జిల్లా విద్యార్థిని అత్యధికంగా 598 మార్కులు సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇతర జిల్లాల నుంచి కూడా స్టడీ మెటీరియల్ ఇవ్వాలని కోరినట్టు జడ్పీ ఛైర్‌పర్సన్ వెల్లడించారు. కార్యక్రమంలో సీఈవో జ్యోతి బసు, గుంటూరు డీఈవో రేణుక, బాపట్ల, పల్నాడు జిల్లాల విద్యాశాఖ అధికారులు ఆవుల తిరుమలరావు, కె.ప్రభాకర్ రావు, కృష్ణ నాయక్ పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

కోతుల దాడిలో ఒకరికి తీవ్ర గాయాలు

ఈపూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కోతుల దాడిలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని ఇనుమెళ్ళలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన బెంజిమెన్ ఇంటి నుంచి వీధిలోకి వస్తుండగా ఒక్కసారిగా కోతులు అతనిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. క్షతగాత్రుడిని బంధువులు ఈపూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. వైద్యులు చికిత్స చేశారు. గ్రామంలో కోతులు బెడద ఎక్కువగా ఉందని, ఇప్పటివరకు సుమారు 20మంది కోతుల దాడిలో గాయపడినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. వీధులలోకి రావాలంటే భయమేస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. కోతుల బారినుంచి రక్షించాలని పలువురు కోరుతున్నారు.

కాల్వలోకి దూసుకువెళ్లిన లారీ

చిలకలూరిపేట, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ఒంగోలు నుంచి పెదకాకానికి పొగాకు లోడుతో వెళ్తున్న ఒక లారీ మార్టూరు చిలకలూరిపేట మధ్య తాతపూడి గ్రామం సమీపంలో బుధవారం తెల్లవారుజామున అదుపుతప్పి కాలువలోకి దూసుకువెళ్ళి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. అయితే లారీ భాగాలు ఊడిపోయి ఎందుకు పనికి రాకుండా పోయింది.

లాడ్జిలపై ఆకస్మిక దాడులు

నర్సరావుపేట లీగల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా ఎస్పీ బీ కృష్ణారావు ఆదేశాల మేరకు మొదటి పట్టణ సీఐ షేక్ టి.ఫిరోజ్ ఆధ్వర్యంలో పోలీసులు మొదటి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని లాడ్జిలపై విస్తృత స్థాయిలో తనిఖీ నిర్వహించారు. తనిఖీలలో వినుకొండ రోడ్డులోని ఓ లాడ్జిలో వ్యభిచారం నిర్వహిస్తుండగా ఏడు జంటలను అదుపులోకి తీసుకున్నారు. మహిళలను రెస్క్యూహోంనకు పంపనట్లు సీఐ తెలిపారు. ఏడుగురు విటులపై కేసు నమోదు చేశామని తెలిపారు.

కొనసాగుతున్న ఫేస్ వాష్ అండ్ గో

నరసరావుపేట లీగల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా ఎస్పీ బీ.కృష్ణారావు ఆదేశాల మేరకు మంగళవారం రహదారులపై రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఫేస్ వాష్ అండ్ గో కార్యక్రమం చేపట్టారు. లారీలు, బస్సులు, వ్యాన్లు, కార్లు, తదితర వాహనాల డ్రైవర్లకు నీళ్లతో ముఖం కడిగించి పంపారు.

వైభవంగా కార్తీకమాస పూజలు ప్రారంభం

రొంపిచర్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా బుధవారం పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. రొంపిచర్లలోని శంకరస్వామి, కొనకంచివారి పాలెంలోని వీరభద్రేశ్వరస్వామి, గోగులపాడులోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులు వేకువజామునే స్నానాలు ఆచరించి కార్తీక దీపాలను వెలిగించారు.

వైభవంగా లింగార్చన

నరసరావుపేట అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలోని మునిసిపల్ కార్యాలయ ప్రాంగణంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా బుధవారం విశేష పూజలను నిర్వహించారు. ఆలయ ఆవరణలోని వెంకటేశ్వరస్వామి, కామేశ్వర స్వాములకు ప్రత్యేక పూజలను అర్చకులు చతుర్వేదుల భ్రమరకుమార్‌శర్మ నిర్వహించారు. లింగార్చన కార్యక్రమం జరిగింది.

క్లుప్తంగా...

● నరసరావుపేట టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అండర్‌స్టాండ్ యువర్ బ్రెయిన్ అనే అంశంపై అవగాహన సదస్సు బుధవారం ఏఎంరెడ్డి పార్మసీ కళాశాలలో జరిగినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పీ భార్గవ్ భూషణ్‌రావు అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అట్లూరి మాధురి మెదడు పనితీరుపై వివరించారు.

● నరసరావుపేట టౌన్: విదేశాలలో విద్యపై కేరిడ్జి ఇంటర్‌నేషనేల్ స్కూల్‌లో బుధవారం సదస్సు జరిగింది. సూడాన్‌కు చెందిన ట్రస్ట్ కన్సల్టెన్సీ ఫర్ స్టడీస్ సంస్థ అధ్యక్షుడు రహమాన్ పలు విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేరిడ్జి ఇంటర్‌నేషనల్ స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ప్రిన్సిపాల్ బర్నబాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: నరసరావుపేటలో ఈ నెల 19న జరిగిన పల్నాడు జిల్లా స్థాయి కరాటే పోటీలలో కేరిడ్జి ఇంటర్‌నేషనల్ విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ బర్నబాస్ బుధవారం తెలిపారు. పోటీలలో 280మంది విద్యార్థులు పాల్గొన్నారని, కేరిడ్జి విద్యార్థులు 20 బంగారు, 13 వెండి, 13 కాంస్య పతకాలను సాధించి ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారన్నారు.

● నరసరావుపేట రూరల్: స్థానిక కేసనపల్లి లోని ఎంఏఎం కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ఎన్‌సీసీలో చేరే విద్యార్థులకు ఎంపికలు జరిగాయి. కార్యక్రమాన్ని 23వ ఆంధ్ర బెటాలియన్ సుబేదార్ అవతార్ సింగ్ హవల్దార్ కిషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

● నరసరావుపేట రూరల్: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర కళాశాల కబడ్డీ పోటీలలో ఎంఏఎం ఫార్మసీ కళాశాలకు చెందిన విద్యార్థి షేక్ అఫ్రిన్ అత్యంత ప్రతిభ కనబర్చిది. ఈ నెల 27న మంగుళూరు యూనివర్సిటీలో జరిగే సౌత్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలలో ఏఎన్‌యూ జట్టుకు షేక్ అఫ్రిన్ ప్రాతినిధ్యం వహించనుంది. అఫ్రిన్‌ను ఎంఏఎం కళాశాల అధినేత మేదరమెట్ల శేషగిరిరావు ఎంఏఎం ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మాచినేని ప్రసాద్ రావులు అభినందించారు.

● ఈపూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అసిస్ట్-ఐటీసీ ఆధ్వర్యంలో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై డ్వాక్రా వీవోఏలకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమాదేవి, ఏపీవో పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

● నాదెండ్ల: వెంకట రాయ శ్రీధర్ ఫౌండేషన్ వారు గణపవరంలోని రెండు పాఠశాలలకు ఫర్నీచర్ బహూకరించారు. ఫౌండేషన్ కార్యదర్శి తోటకూర వెంకట నారాయణ తన తండ్రి రామ కోటయ్య జ్ఞాపకార్థం ఆరు కుర్చీలు, నోటీసు బోర్డులు బహూకరించారు.

అధ్వానంగా అయ్యప్పకుంట పరిసరాలు

● మురుగు, పిచ్చి మొక్కలతో సర్పాల సంచారం ● బిక్కుబిక్కుమంటున్న ప్రజలు



మురుగు, పిచ్చిమొక్కలతో మెట్ల బజారు నుంచి కోటనాల్సా బజారుకు వెళ్లే రోడ్డు

వినుకొండ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెట్ల బజారు ప్రధాన రహదారి నుంచి కోట నాల్సా బజారు మసీదు వరకు రోడ్డు నిర్మించకపోవడంతో ఆ ప్రాంతంలో విషసర్పాలకు నిలయంగా మారింది. ప్రధానంగా కొండపై వర్షపునీరంతా అప్పయ్యకుంటకు చేరి అప్పయ్యకుంట సమీపంలో నుంచి ఆ ప్రాంతంలో నిరుపయోగంగా ఉన్న రోడ్లపై నీరు నిల్వ ఉండటంతో అక్కడంతా మురుగుమయమై, విషకీటకాల తాకిడితో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ అధికారులు, పాలకవర్గం సభ్యులు 23వ వార్డులోని అప్పయ్యకుంటకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా కోటనాల్సా బజారు నుంచి మెట్ల బజారు వెళ్లే నిరుపయోగంగా ఉన్న మట్టి రోడ్డును పునఃనిర్మించాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.

సొంతింటి కలను సాకారం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

● ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు



టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదవారి సొంతింటి కలకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. నరసరావుపేట మండలం కేశానుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన 1504 టిడ్కో గృహాల నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో గురువారం 200మంది లబ్ధిదారులకు గృహాలను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో టిడ్కో గృహాల వద్ద జరుగుతున్న పనులను బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పరిశీలించారు. కాలనీలో గృహాలు పొందిన లబ్ధిదారులందరూ తప్పనిసరిగా నివాసం ఉండాలని నివాసం లేని వారి పేర్లు తొలగించి పేదలకు పంపిణీ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. గృహాల పంపిణీ కార్యక్రమానికి జిల్లా ఇన్చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా హాజరుకానున్నారు. కార్యక్రమంలో టిడ్కో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బత్తుల సెల్వరాజ్, ఉపాధ్యక్షుడు మేడికొండ సత్యానందబాబు, సభ్యులు బుజ్జి, శంకర్, బత్తుల నారాయణ, మల్లీశ్వరి, షబానా తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నూరుశాతం రాయితీపై చేప పిల్లలందిస్తాం

▶▶ జిల్లా మత్స్యశాఖ అధికారి సంజీవరావు



సమావేశంలో మాట్లాడుతున్న మత్స్య శాఖ అధికారులు

నరసరావుపేట రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పంటలు పండని భూములను చెరువులుగా ఏర్పాటుచేస్తే చేపలు పెంచుకోవడం కోసం ప్రభుత్వం నూరు శాతం సబ్సిడీ ద్వారా చేప పిల్లలను ఇస్తుందని పల్నాడు జిల్లా మత్స్యశాఖ అధికారి సంజీవరావు అన్నారు. బుధవారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో నరసరావుపేట బరంపేటలోని సాధికార కార్యాలయంలో ప్రభుత్వ అధికారులకు రైతులకు ముఖాముఖి కార్యక్రమం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ గుంటూరు పల్నాడు జిల్లాల ప్రోగ్రాం కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖ అధికారి సంజీవరావు మాట్లాడుతూ మత్స్యకారులు సహకార సంఘాలుగా ఏర్పడి ప్రభుత్వం ద్వారా వస్తున్న సంక్షేమ పథకాలతో అభివృద్ధి చెందాలన్నారు. ఇప్పటికే పల్నాడు జిల్లాలో 35 సొసైటీలు ఉన్నాయని ఇంకా సొసైటీలుగా ఏర్పాటుచేసుకొని ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీలను పొందాలని కోరారు. దళిత బహుజన రిసోర్సు సెంటర్ రాష్ట్ర కోఆర్డినేటర్ హేమలత మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ రైతులు కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు వారి సమస్యలను తెలుసుకుని ప్రభుత్వ శాఖ అధికారుల ద్వారా పరిష్కారానికి ఈ వేదిక ఏర్పాటు చేయడం జరిగిందని ఈ ముఖాముఖి కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు కౌలు రైతులు వ్యవసాయ కూలీలకు ఉన్నటువంటి సమస్యలు అడిగి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా డ్వామా ప్లాంటేషన్ మేనేజర్ శిరీష, జడ్‌బీ ఎన్ఎఫ్ మార్కెటింగ్ ఎం. మేరీ, డీబీఆర్‌సీ సంస్థ నరసరావుపేట ఏరియా కోఆర్డినేటర్ సాంబయ్య తోకల, గడ్డిపర్తి కోటిరత్నం, జిల్లా వ్యాప్తంగా 60మంది రైతులు కౌలు రైతులు వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిలో ఓ మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగాలి

● అడిషనల్ సీఈవో శ్రీరాములు



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ సీఈవో శ్రీరాములు

నరసరావుపేట రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటిలో ఓ మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అడిషనల్ సీఈవో శ్రీరాములు తెలిపారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ - వెలుగు సిబ్బంది సమీక్షా సమావేశంలో అడిషనల్ సీఈవో శ్రీరాములు నాయుడు, అడ్మిన్ డైరెక్టర్ కల్యాణ చక్రవర్తి పాల్గొన్నారు. కోటప్పకొండలోని శ్రీకృష్ణదేవరాయ కల్యాణ మండపంలో వెలుగు ఏపీఎంలు, సీసీలకు ప్రాజెక్టు ప్రాధాన్య అంశాలపై అడిషనల్ సీఈవో శ్రీరాములు నాయుడు సమీక్ష నిర్వహించారు. మన డబ్బులు మన లెక్కలు అనే అంశంపై ప్రతి సంఘం సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. అడ్మిన్ డైరెక్టర్ కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ మహిళందరూ కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకొని తిరిగి బ్యాంకులకు సకాలంలో రుణాలు చెల్లించేలా అవగాహనా కలిగించాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ ఝాన్సీ రాణి, అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ రాజా ప్రతాప్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కోయ రజిని కుమారి, స్టేట్ ఆఫీస్ వాల్మీకి, శోభ, దాసు, జిల్లాలోని అందరూ ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

పశువుల్లో గర్భకోశవ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● పల్నాడు జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి రామారావు

కనమర్లపూడి (శావల్యాపురం) అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పశువులలో గర్భకోశ వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని పల్నాడు జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి డాక్టర్ రామారావు అన్నారు. పశుగణాభివృద్ధి, పశుసంవర్ధకశాఖల ఆధ్వర్యంలో శావల్యాపురం మండలం కనమర్లపూడిలో బుధవారం పశువులకు గర్భకోశవ్యాధుల చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 30 పశువులకు వైద్యపరీక్షలు చేసి మందులు ఇచ్చారు. కార్యక్రమంలో సహాయసంచాలకులు డాక్టర్ రామచంద్రరావు, తెలుగు రైతు జిల్లా ఉపాధ్యక్షుడు గోరింట్ల హనుమంతరావు, ఎం.నాగేశ్వరరావు, పశు వైద్యాధికారులు కావ్య, గణేష్‌కుమార్, వెటర్నీ అసిస్టెంట్ బుల్లెయ్య పాల్గొన్నారు.

ఉప్పలపాడులో ఘనంగా గోపూజ

నరసరావుపేట రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలపాడు గ్రామ సమీపంలోని మూడు ఎకరాల స్థలంలో గోపూజ, గోవర్ధనగిరి ప్రథమ భాగం ప్రారంభోత్సవ వేడుకలు నరసరావుపేట ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఇస్కాన్ టెంపుల్ భక్తులు గాయత్రి ఎలక్ట్రికల్స్ రమణారెడ్డి, గ్రామ ప్రజలు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు, ఇస్కాన్ ఆలయ భక్తులు సప్త గో ప్రదర్శన పూజా కార్యక్రమంను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో గాయత్రి ఎలక్ట్రికల్స్ రమణారెడ్డి, రావెల సత్యనారాయణ, చేగు వెంకటేశ్వరరావు, బిల్లా రాంబాబు, జొన్నలగడ్డ నాగరాజేశ్వరి, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

29న ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో జాబ్ మేళా

నరసరావుపేట టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 29న ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామని కలెక్టర్ కృతికా శుక్లా వెల్లడించారు. బుధవారం నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయంలో జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ జాబ్ మేళాలో 30కి పైగా బహుళజాతి కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. జీతం విద్యార్హతను బట్టి రూ.12వేల నుంచి రూ.40 వేల వరకు ఉంటుందన్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ తమ్మాజీరావు, రామాంజినేయులు, రవీంద్రనాయక్, ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహీద్దీన్ పాల్గొన్నారు. జాబ్ మేళాకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమో, ఫార్మసీ, పీజీ వరకు చదువుకున్న 18 నుంచి 35 సంవత్సరాల నిరుద్యోగ యువత బయోడేటా, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్లు, జిరాక్స్ ఆధార్ నకలు, పాస్‌పోర్టు ఫొటోతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. అదనపు సమాచారం కోసం 9160200652, 9642194600, 9573247861, 8121360425, 9100566581, 7702921219 నంబర్లను సంప్రదించాలన్నారు.

పాఠశాలకు ఇన్‌వర్టర్ వితరణ



ఇన్‌వర్టర్‌ను అందిస్తున్న కమిటీ అధ్యక్షుడు చలపతిరావు

వేల్పూరు (శావల్యాపురం) అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పూరు జడ్పీ పాఠశాల్లో రాత్రివేళ ట్యూషన్‌లకు హాజరైన విద్యార్థులు కరెంట్ లేని సమయంలో చదువుకునేందుకు పూర్వ విద్యార్థి, శావల్యాపురం సొసైటీ మాజీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య రూ.10వేలు విలువజేసే ఇన్‌వర్టర్, బ్యాటరీలను అందజేశారు. వీటిని వివేకానంద పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షుడు సంద్రపాటి చలపతిరావు బుధవారం హెచ్ఎంకి అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయమని వేల్పూరు జడ్పీపాఠశాల హెచ్ఎం మహబూబ్ సుభానీ తెలిపారు. చలపతిరావు మాట్లాడుతూ దుస్తుల కొనుగోలుకు పూర్వవిద్యార్థులు సాదినేని కృష్ణారావు రూ.4వేలు, కామేపల్లి వీరబ్రహ్మం రూ.3వేలు, యలవర్తి అప్పారావు రూ.2వేలు, ఎం.ఏడుకొండలు రూ.1000 విరాళంగా అందించారన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో డీవైఈవో తనిఖీ

నూజెండ్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ములకలూరు జడ్పీ పాఠశాలను బుధవారం డీవైఈవో ఎస్కే మహబూబ్ సుభానీ ఫ్యానల్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. అనంతరం పల్నాడు బాలోత్సవం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీవైఈవో మాట్లాడుతూ నవంబరు 29, 30 తేదీల్లో నరసరావుపేట ఎస్ఎస్ఎన్ కళాశాలలో జరిగే పిల్లల పండుగను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వినుకొండ నియోజకవర్గ బాలోత్సవ కమిటీ ఇన్‌చార్జ్ బెజవాడ వెంకట నాగేశ్వరరావు, ఎంఈవోలు కే.సత్యనారాయణ, ఎన్ రవిచంద్ర, ఫ్యానల్ ఇన్‌స్పెక్షన్ బృందంలో ప్రధానోపాధ్యాయులు బీ శ్రీదేవి, వై యశోద, బీవీ నరసింహారావు, శ్రీరాములు నాయక్, డీ జానకి, సీహెచ్ వీర అప్పయ్య, ఎస్ అన్నపూర్ణమ్మ, ఫిజికల్ డైరెక్టర్ రూత్‌మేరి తదితరులు పాల్గొన్నారు.

26న మెగా వైద్య శిబిరం

బొల్లాపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రమేష్ హాస్పటల్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీన ఆదివారం బొల్లాపల్లి ఏపీ మోడల్ స్కూల్‌లో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు హాస్పటల్ నిర్వాహకులు బుధవారం తెలిపారు. ముందుగా గ్రామాల్లో ప్రచారం నిర్వహించి ఆదివారం క్యాంపును నిర్వహించనున్నట్టు వారు తెలిపారు. ఈ ఉచిత మెగా వైద్య శిబిరంలో గుండె సంబంధిత వ్యాధులు, చిన్న పిల్లలు, మూత్ర పిండాలు, నరాల వంటి సమస్యలపై వివిధ రకాల జబ్బులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని నిర్వాహకులు కోరారు.

అధికారుల తీరుపై కౌన్సిలర్ల అసంతృప్తి



సమావేశంలో పాల్గొన్న చైర్మన్ డాక్టర్ దస్తగిరి

వినుకొండ టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ దస్తగిరి అధ్యక్షతన మున్సిపల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో మొత్తం 57 అంశాలను శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్ సమావేశం దృష్టికి తీసుకురాగా కేవలం ఆరేడు అంశాలను వినిపించినవెంటనే మిగిలిన అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో ప్రవేశపెట్టిన అంశాలను ఏకగ్రీవంగా తీర్మానం చేయడం పరిపాటిగా మారింది. మున్సిపాలిటీలో అజెండాలో పొందుపరిచే అంశాల కంటే ముందుగా జరిగిన పనులపై మాత్రమే అజెండాలో పొందుపరిచి సభలో తీర్మానం చేయించుకోవడంపై సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పలుకుబడి ఉన్న నేతలకే పనులు జరుగుతున్నాయి తప్ప కొన్ని వార్డుల్లో కనీసం పనులు ప్రారంభించిన దాఖలాలు లేవని, మరికొందరు కౌన్సిలర్లు సమావేశాల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మొక్కుబడిగా సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారే తప్ప పట్టణంలోని ప్రధాన సమస్యలపై దృష్టిసారించడం లేదని వాపోతున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వైస్‌చైర్మన్‌లు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా వినుకొండ పురపాలక సంఘ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న మహాత్మాగాంధీ విగ్రహ శిలాఫలకంపై కౌన్సిలర్ల పేర్లు ఎందుకు ప్రచురించలేదని కొందరు సభ్యులు చైర్మన్‌ను నిలదీశారు.

ఆలయ నిర్మాణానికి భక్తుల విరాళాలు



విరాళం అందజేస్తున్న దాతలు

నరసరావుపేట రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోట బజార్, పులుపులవారి వీధిలోని వీరాంజనేయ సహిత శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి దేవాలయ నిర్మాణానికి నరసరావుపేటకు చెందిన దాతలు విరాళం అందజేశారు. బాలవాసవి సిల్వర్ వేర్, జ్యూవెలరీస్ అధినేత కనుమర్లపూడి పూర్ణచంద్రరావు, సౌభాగ్యంల కుమారుడు రాఘవరావు, శివపార్వతి దంపతులు రూ.3,00,006, సింగినంశెట్టి లక్ష్మీ నరసింహారావు భార్య లక్ష్మీమల్లికాంబ జ్ఞాపకార్థం రూ.25,116, జెట్టి నాగయ్య, హరిప్రియ దంపతులు రూ.25,116, దేవస్థాన కమిటీ సభ్యులకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో పి.రాము, వి.కృష్ణ, కె.శివ, శ్రీనుబాబు, జి.మురళి తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రత్తిపాటి పులారావు, తదితరులు

సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్రారంభం

చిలకలూరిపేట, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శారదా హైస్కూలులో రూ.42లక్షలతో నెలకొల్పిన సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్ఐ గోరంట్ల వాసు శారదా హైస్కూల్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా 130పాఠశాలల విద్యార్థులకు అవసరమైన బోధనా ఉపకరణాలు సమకూర్చి పలు సౌకర్యాలు కల్పించడం అభినందనీయమన్నారు. ఎన్ఆర్ఐ వాసు దాతృత్వం విద్యార్థులకు వరమని చెప్పారు. సీఎస్ఆర్ నిధులతో దాతలు నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని, పీ-4లో భాగస్వాములై పేదల కుటుంబాలను ఆదుకోవాలని ఆయన కోరారు. మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కమిషనర్ పి.శ్రీహరిబాబు, డీఈ అబ్దుల్ రహీమ్, హెచ్ఎం కె.రత్నజ్యోతి పాల్గొన్నారు.



కార్డెన్ సెర్చ్‌లో పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

చిలకలూరిపేట టిడ్కో కాలనీలో కార్డెన్ సెర్చ్

● సరైన పత్రాలు లేని 96 వాహనాల స్వాధీనం

చిలకలూరిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెరువు రోడ్‌లో 52 ఎకరాలలో ఉన్న టిడ్కో కాలనీలో బుధవారం తెల్లవారుజామున పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటిని పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేసి నివాసితుల వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 95 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, 3 గొడ్డళ్లు, ఒక కత్తి స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు నరసరావుపేట ఇంచార్జి డీఎస్పీ ఎం.హనుమంతరావు ఆధ్వర్యంలో నరసరావుపేట, చిలకలూరిపేట అర్బన్, రూరల్ సీఐలు పి.రమేష్, బి.సుబ్బనాయుడు, ఫిరోజ్, పి.రామకృష్ణ, సుమారు 100 మంది ఎస్ఐలు, సిబ్బంది ఈ కార్డెన్ సెర్చ్‌లో పాల్గొన్నారు. అనంతరం కాలనీవాసులతో సమావేశం నిర్వహించి సమాజంలో జరుగుచున్న ఆర్థికపరమైన మోసాలపై, ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. అక్రమ మద్యం, గంజాయి, డ్రగ్స్ వంటి నిషేధిత ఉత్పత్తులు నిల్వ చేసినా, స్మగ్లింగ్ చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

లింగారావుపాలెంలో 300 మందికి వైద్య పరీక్షలు

యడ్లపాడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగారావుపాలెంలో కాటూరి మెడికల్ కళాశాల సహకారంతో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బుధవారం స్థానిక కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ మెగా వైద్య శిబిరాన్ని ఎంపీటీసీ సభ్యులు తోకల రాఘవయ్య ప్రారంభించారు. కాటూరి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ నిఖిత, డాక్టర్ తులసి, డాక్టర్ కల్పన, డాక్టర్ కుముదశ్రీ, డాక్టర్ నవీన్, డాక్టర్ పూజిత, డాక్టర్ వెంకటనాయుడులు శిబిరంలో పాల్గొని వైద్య సేవలు అందించారు. సుమారు 300మందికి గుండె, ఎముకలు, చర్మ, దంత వ్యాధులతోపాటు సాధారణ వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామ పెద్దలు, టీడీపీ నాయకులు సాదినేని సుధీర్, మురుకుట్ల శ్రీధర్, తోకల రాజేష్, సత్యన్నారాయణ, ఎన్.రంగారావు, ఎన్.వీరాంజనేయులు, కె.శ్రీహరి, కె.పద్మారావులు క్యాంపు నిర్వహణకు సహకారాన్ని అందించారు.

జాతీయ స్థాయి ఖో-ఖో జట్టుకు ముప్పాళ్ళ విద్యార్థి ఎంపిక



సింహాద్రి నాయక్

ఈపూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాళ్ళ ధనలక్ష్మీ వ్యాయామ కళాశాల విద్యార్థి బీ సింహాద్రి సీనియర్ సౌత్‌జోన్ నేషనల్ ఖో-ఖో జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ చుండు వెంకటరావు బుధవారం చెప్పారు. ఈ నెల 18వ తేదీన కృష్ణా జిల్లా గన్నవరం హైస్కూల్‌లో జరిగిన ఎంపిక పోటీలలో సింహాద్రినాయక్ ప్రతిభ కనబరిచాడన్నారు. ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రంలోని దావణగెరేలో జరిగే పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన సింహాద్రిని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మేదరమెట్ల రామశేషగిరిరావు, అధ్యాపకులు ఆర్.బలరాంనాయక్, సీహెచ్ అరవిందబాబు, కే.సాయి ప్రసాదు, ఎం.దాసు అభినందించారు.

శ్రీశైలం దేవస్థానం అభివృద్ధికి కృషిచేయాలి: జీవీ

వినుకొండ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేయాలని పాలక మండలి సభ్యుడిగా నియమితులైన బోడెపూడి వెంకటసుబ్బారావును చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు కోరారు. మాజీ సర్పంచి శంకరశెట్టి పిచ్చయ్యతో కలిసి బోడేపూడి చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులును బుధవారం ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా సుబ్బారావు, పిచ్చయ్యలను జీవీ శాలువాలతో సన్మానించారు. అనంతరం జీవీ మాట్లాడుతూ వినుకొండ ప్రాంతానికి చెందిన వ్యక్తి శ్రీశైలం బోర్డు సభ్యుడిగా ఎంపికవ్వడం మనందరికీ గర్వకారణమన్నారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు టీడీపీ సీనియర్ నాయకులు ఎల్.వెంకట్రావు, యార్డు చైర్మన్ మురళీకృష్ణ యాదవ్, ఆర్.జగ్గారావు, ఎం.సుబ్బారావు, బుల్లేశ్వరరెడ్డి, బి.రోశయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.